www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 337 | శుక్రవారం | 08-11-2024 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, నవంబరు 08

ఎన్నికల హామీల్లో 'మహా' పోటీ

ఎదుటివారి కంట్లో నెరసు వెదికే అమ్మకు తన కంట్లో దూలం తెలియదనేది సామెత. ఎన్నికల్లో ప్రత్యర్థుల ఆరోపణలే కాదు, ఓటర్లను ఆకట్టుకునే వాగ్దానాలు కూడా ఈ సామెతను గుర్తు చేస్తున్నాయి. ఏ రాష్ట్రంలో అయినా ఆ రాష్ట్ర ఆదాయ వనరులు – వ్యయాలతో నిమిత్తం లేకుండా ఓటర్లకు అలివిమాలిన వాగ్దానాలు చేయటం, ఆనక వనరుల లేమితో పూర్తిగా అమలు చేయలేక ఆపసోపాలు పడటం గత దశాబ్దకాలంలో పరిపాటి అయింది. ఓటర్లు ఎల్లప్పుడూ వాటి వెంటపడి కొట్టుకపోకపోవచ్చు. అలా జరిగితే అతిగా ఉచిత వాగ్దానాలు చేసిన పార్టీయే గెలవా లి. అయితే పార్టీలు పోటాపోటీ వాగ్దానాలతో ఖజానాను ఖాళీ చేస్తుంటే ద్రవ్య సంక్షోభం ఏర్పడి పొరుగుదేశం శ్రీలంకకు పట్టిన గతే మనకూ పడుతుందని విజ్ఞులు హెచ్చరికలు చేసినా ప్రధాన పాలకవర్గ రాజకీయ పార్టీలు చెవినెక్కించుకోవటం లేదు. కేంద్రప్రభుత్వానికైతే ఏటా ఎన్ని లక్షల కోట్ల రూపాయలైనా అప్పులు చేసే వెసులుబాటు ఉంటుంది. రాష్ట్రాల పరిస్థితి అది కాదే! తలకు మించిన భారంగా తయారవుతున్న ఉచిత పంపిణీ హామీలను రేవడీలు (మిఠాయిలు) గా ఎద్దేవా చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమ పార్టీని ఏమైనా అదుపులో ఉంచుతున్నారా? లేదే! ఒక్కొక్క అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలో ప్రధాని పర్యటిస్తూ వందలవేల కోట్ల రూపాయలు ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు, కొన్నింటికి శంకుస్థాపనలు చేస్తున్నారు. అవి ఎప్పటికి పూర్తవుతాయో ఆయనకే తెలియకపోవచ్చు. వాటికితోడుగా ఆయన పార్టీ ఉచిత పంపిణీ వాగ్దానాలు, కుల, మత విభజన రాజకీయంతో ఓటర్లకు గాలమేస్తున్నది వాస్తవమేకదా? ఈ నెలారంభంలో, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, 'ఆర్థికంగా అమలు చేయగలిగిన వాగ్దానాలు చేయండి' అని తమ పార్టీవారికి సలహాయిస్తే అదే తప్పన్నట్లుగా ప్రధానమంత్రి కస్సుమన్నారు. 'కాంగ్రెస్ వారు అవాస్తవిక వాగ్దానాలపై ఇబ్బందికరమైన పాఠాలు నేర్చుకుంటున్నారు. అవాస్తవిక వాగ్దానాలు చేయటం సులభం – అమలు చేయటం కష్టం, అసాధ్యమని కాంగ్రెస్ గుర్తిస్తున్నది' అని వ్యాఖ్యానించారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌ల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలను ప్రస్తావిస్తూ, 'కాంగ్రెస్‌వి బూటకపు వాగ్దానాలు' అన్నారు. తమ పార్టీ చెప్పినవన్నీ అమలు చేస్తున్నట్లు! తమకి అధికారమిస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014 ఎన్నికల సమయంలో అప్పుడే జాతీయ రాజకీయాల్లోకి వచ్చిన నరేంద్రమోదీగారు ఇచ్చిన వాగ్దానం ఏమైంది. నిలదీస్తే 'పకోడీలు' అమ్ముకోవటం కూడా ఉద్యోగమేనని బుకాయించారు. అమిత్ షా గారేమో అది 'ఎన్నికల జుమ్లా' అని కొట్టిపారేశారు. అందువల్ల ఓటర్లు ఉచిత పంపిణీ వాగ్దానాలనే కాదు, రాజకీయ పార్టీ నాయకుల నీతిని జాయితీని, అధికారంలోని పార్టీ పాలన తీరునూ గమనించి ఓటు నిర్ణయం తీసుకుంటారు.

ప్రస్తుతం జరుగుతున్న ఝార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కూటముల వాగ్దానాలను చూస్తే – ఉదాహరణకు మహిళలకు నెలకు రూ.2వేలు అలవెన్స్ అని ఇండియా కూటమి నేత, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటిస్తే, బిజెపి వారు రూ.2100 అన్నారు. దాంతో సోరెన్ రూ.2500 పెంచారు. మధ్యప్రదేశ్ ఉప ఎన్నికలకు కూడా బిజెపి మహిళలకు రూ.2100 ఉచిత సహాయం ప్రకటించింది.

మహారాష్ట్రలో పాలక మహాయుతి మహిళలకు నెలకు రూ.1500 ఉచిత అలవెన్స్‌తో లడ్లీ బెహనా స్కీము ప్రకటించింది. దానిపై అడ్వర్టయిజ్‌మెంట్లకే కోట్లు ఖర్చు చేసింది. అయితే ప్రతిపక్ష మహావికాస్ అగాఢి సెగ తగిలినట్లుంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండె లడ్లీ బెహనా కింద అలవెన్స్‌ను రూ.1500 నుండి రూ.2100కు పెంచుతూ బుధవారం ప్రకటించారు. ఇంతకు మునుపు ప్రకటించిన హామీలకు తోడు, రైతులకు రుణమాఫీ, షేట్కారీ సామాన్ నిధికింద రైతులకు రూ.15వేలు చెల్లింపు, ధరల స్థిరీకరణ, వృద్ధాప్య పెన్షన్ క్రింద నెలకు రూ.2100, విద్యుత్ చార్జి 30శాతం తగ్గింపు ప్రకటించారు.

ఇదిలావుండగా ఇండియా కూటమి (ఎంవిఎ) తరఫున రాహుల్‌గాంధి బుధవారం ముంబయిలో శరద్ పవార్, ఉద్ధావ్ థాక్రే సమక్షంలో మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, నెలకు రూ.3000అలవెన్స్, రూ.3లక్షల వరకు రైతు రుణమాఫీ, కుటుంబానికి రూ.25లక్షల వరకు ఆరోగ్య బీమా, రెగ్యులర్‌గా రుణా లు చెల్లించేవారికి రూ.50 వేలు ప్రోత్సాహం ప్రకటించారు. రాష్ట్రంలో కులగణన చేబడతామని, కేంద్రంలో అధికారంలోకి వచ్చినపుడు రిజర్వేషన్‌లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేస్తామని చెప్పారు. ఇక నిర్ణయం ఓటర్లదే!

బిఆర్ఎస్‌కు ముందు 'మూసీ'.. వెనక 'బిసి'!

ఎస్‌కె జకీర్
సీనియర్ జర్నలిస్ట్
9052631212

'ముందు నుయ్యి వెనుక గొయ్యి' అనే సామెత మనందరికీ తెలుసు. భారత రాష్ట్ర సమితికి మూసీ, కులగణన... రెండు అంశాలు అలాగే తయారయ్యాయి. రేవంత్ రెడ్డి మెరుపు నిర్ణయాలు బిఆర్ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నవి. రేవంత్ రెడ్డిపై 'అవినీతి' ఆరోపణలు చేస్తూ, సోషల్ మీడియాలో స్వైర విహారం చేస్తూ ప్రజాదరణ పొందడానికి బిఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. కానీ ఆ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ప్రస్తుతానికి కనిపించడం లేదు.

''రణరంగంలో ఎవరు ముందుగా ప్రవేశించి శత్రువు రాకకోసం ఎదురు చూస్తుంటారో, వాళ్ళే యుద్ధానికి సిద్ధంగా ఉంటారు. రణరంగంలోకి ఆలస్యంగా ప్రవేశించేవాళ్ళు సాధారణంగా యుద్ధంకోసం తొందరపడి త్వరగా అలసిపోతారు.''అని క్రీస్తు పూర్వం 3 వ శతాబ్దానికి చెందిన యుద్ధరంగ నిపుణుడు సుంజు విశ్లేషించాడు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫార్ములాను అనుసరిస్తున్నట్టుగా కనబడుతున్నది. ప్రతిపక్షాలు బిఆర్ఎస్, బిజెపిలకు దిమ్మ తిరిగేలా రేవంత్ వ్యూహాలు ఉంటున్నాయి. మూసీ ప్రక్షాళన, హైడ్రా, స్కిల్ యూనివర్సిటీ...తదితర నిర్ణయాలతో పాటు కులగణన రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి రాజకీయంగా సానుకూల మైలేజీని సమకూర్చి పెట్టే అవకాశాలున్నవి. మూసీ అయినా, కులగణన అయినా రేవంత్ రెడ్డి ప్రతిపక్షాల కన్నా ఒక అడుగు ముందున్నారు. 'సుంజు' తన 'ఆర్ట్ ఆఫ్ వార్' లో చెప్పినట్టుగానే రేవంత్ రణరంగంలో ముందుగా దిగి ప్రతిపక్షాలను హడలెత్తిస్తున్నట్టు కనబడుతున్నది.

'మూసీ'అంటే నీళ్లు మాత్రమే కాదు. మూసీ అంటే దక్కన్. మూసీ అంటే తెలంగాణ. దీన్ని మురుగు కాల్వగా, మురికి గుంటగా మార్చడానికి దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నవి. మూసా, ఈసా నదుల సంగమాన్ని 'మూసీ' గా పిలుస్తున్నాం. ఈ నదీ సంగమంలోనే గాంధీ, నెహ్రూల చితాభస్మాలను కలిపిన చరిత్ర చాలామందికి తెలియదు. నర్మద,తుంగభద్ర నదుల మధ్యన చరిత్ర సృష్టించిన అస్తిత్వంగా కూడా మూసీకి పేరుంది. హైదరాబాద్‌ను ప్రేమించేవారెప్పుడూ ఈ నగరాన్ని, మూసీ ఉపనదులు, చెరువులను ధ్వంసం చేయలేదు.

ఇప్పుడు మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు తెలంగాణ రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారింది. నిర్వాసితుల వ్యతిరేకత, ప్రతిపక్షాల అభ్యంతరాలు, ప్రాజెక్టు వ్యయ అంచనాల్లో కుంభకోణం జరుగుతున్నదంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపణలు గుప్పించడం...వంటి అంశాల మధ్య మూసీనది ప్రక్షాళన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టగా తీసుకున్నది. ఈ ప్రాజెక్టును దశలవారీగా చేపట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చాదర్ ఘాట్, ముసారాంబాగ్ ప్రాంతాల్లో నిర్వాసితుల తరలింపు ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే చేపట్టింది.

నగర శివారులోని గండిపేట ప్రాంతం దాటాక పారిశ్రామిక, ఇతర వ్యర్థ జలాలు కలుస్తుండటంతో మూసీనది మురికికూపంగా మారింది.

మూసీ నది చరిత్రలో 1908 సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో మూసీకి వచ్చిన వరదలు నగరాన్ని ముంచెత్తాయి. అప్పటి నిజాం ప్రభుత్వ లెక్కల ప్రకారం, వరదల కారణంగా దాదాపు 15వేల మంది చనిపోయారు. 80వేల మంది నిరాశ్రయులయ్యారు. ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న చింత చెట్టుపైకి ఎక్కి సుమారు 150 మంది ప్రాణాలు కాపాడుకున్నారని ఇప్పటికీ చెప్పుకొంటారు. దీనికి గుర్తుగా 2002లో చింత చెట్టుకు 'ప్రాణధాత్రి'గా పేరు పెట్టారు. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ విజ్ఞప్తి మేరకు ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య హైదరాబాద్‌ను సందర్శించారు. మూసీ నదికి సమగ్ర నీటి ప్రణాళికను సిద్ధం చేశారు. అందులో భాగంగా భవిష్యత్తులో వరదల నియంత్రణకుగాను గండిపేట (ఉస్మాన్ సాగర్), హిమాయత్ సాగర్ జలాశయాలను నిజాం ప్రభుత్వం నిర్మించింది.1930, 1954, 1970, 2000 సంవత్సరాల్లో మూసీ నదికి వరదలు వచ్చినా, జలాశయాల నిర్మాణంతో వరదల నియంత్రణ సాధ్యపడిందని జలవనరుల నిపుణులు చెబుతున్నారు..

మూసీ ప్రక్షాళన దిశగా 1997లో ప్రభుత్వం మొదటి అడుగు వేసింది. 'నందనవనం' పేరుతో ప్రాజెక్టును తీసుకువచ్చింది. నదీ గర్భాన్ని అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. బాపూ ఘాట్ నుంచి నాగోలు వరకు అభివృద్ధి పనులు చేపట్టాలని టిడిపి ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. ఆ తర్వాత రెండేళ్లలో నందనవనం ప్రాజెక్టులో భాగంగా అప్పట్లో చాదర్ ఘాట్ ప్రాంతంలో నదీ గర్భంలో పదిమీటర్ల కాంక్రీట్ ఛానెల్ నిర్మించారు. వివిధ కారణాలతో ప్రాజెక్టు 2001లో నిలిచిపోయింది. 2005లో డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో 'సేవ్ మూసీ' ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిపాదించింది. రూ.908 కోట్లతో మూసీని సుందరీకరించాలని ప్రణాళిక రచించారు. కానీ అది కూడా ముందుకు కదల్లేదు. ప్రాజెక్టు వ్యయం, పునరావాసం, ప్రక్షాళన, సుందరీకరణ వేర్వేరుగా చేయాల్సి ఉండటం వంటి కారణాలతో సేవ్ మూసీ ప్రాజెక్టు అటకెక్కింది.

2014లో తెలంగాణ ఏర్పాటు తర్వాత మూసీ అభివృద్ధి ప్రతిపాదనను నాటి కెసిఆర్ ప్రభుత్వం తీసుకువచ్చింది. 2017 మార్చి 25న జిఒ నెం.90 ద్వారా 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్' ను ఏర్పాటు చేసింది. మూసీ సుందరీకరణ, అభివృద్ధికి రూ.16,635 కోట్లతో కెసిఆర్ ప్రభుత్వం అంచనాలు రూపొందించింది. కొత్తపేట నుంచి నాగోలు, హైకోర్టు, చాదర్ ఘాట్ ప్రాంతాల్లో వాకింగ్ ట్రాకులు,పార్కులు,ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది.

కాగా మూసీలోకి వెళ్లే మురికినీటిని శుద్ధిచేసి పంపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ''2,400 కిలోమీటర్ల ఉన్న గంగానది ప్రక్షాళనకు ఉద్దేశించిన నమామి గంగ ప్రాజెక్ట్ కోసం రూ.40వేల కోట్లు ఖర్చు చేశారు. కానీ 55 కిలోమీటర్ల పొడవున్న మూసీకి మాత్రం రూ.లక్షా 50వేల కోట్లు ఎలా ఖర్చవుతాయి? ఇందులో భారీ కుంభకోణం ఉంది.'' అని కెటిఆర్ ఆరోపించడం నిత్యకృత్యంగా మారింది. మూసీ ప్రక్షాళనకు 2024–25 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1000కోట్లు కేటాయించింది.''మూసీ నది ప్రాజెక్టుకు సంబంధించి ప్రణాళికలపై అధ్యయనం జరగాల్సి ఉంది. దీనికి ఖర్చు ఎంత అనేది ఇప్పటివరకు ప్రభుత్వం అనుకోలేదు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక వచ్చాక ఖర్చు ఎంతనేది తెలుస్తుంది'' అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

మొత్తం 55 కిలోమీటర్లు మూసీ వెంట సర్వే చేయగా, దాదాపు 10,600కట్టడాలు, ఇళ్లు మూసీ బఫర్ జోన్, రివర్ బెడ్‌లో ఉన్నాయని తేలింది. మూసీ ప్రాజెక్టులో నిర్వాసితులయ్యే వారికోసం 16 వేల ఇళ్లను కేటాయిస్తూ గత సెప్టెంబరు 26న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో సిఎం.రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజున నవంబర్ 8న పాదయాత్ర తలపెట్టారు.

తెలంగాణలో నవంబర్ 6 నుంచి సమగ్ర కులగణన ప్రారంభమైంది. మూడు వారాల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రభుత్వంతో పాటు, కాంగ్రెస్ పార్టీ కూడా ఉత్సాహంగా పనిచేస్తోంది. కులగణన విషయంలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్ అవుతుందని రాహుల్ గాంధీ నవంబర్ 5న హైదరాబాద్‌లో చెప్పారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పేరుతో కులగణన జరుగుతోంది. ''ఇప్పటివరకూ జనాభాలో 52 శాతం బిసిలు అని చెబుతు న్నాం. దాన్ని రుజువు చేసే అవకాశం ఈ సర్వే ద్వారా దక్కింది. అన్ని కులాల లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తేలుతాయి.'' అని తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు.

కులగణన చట్టబద్ధత కోసం రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు సారధ్యంలో 'డెడికేటెడ్ కమిషన్' ను నియమించా రు. ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న హడావుడిగా తెలంగాణ బిజెపి నాయకులు కొట్టిపారేశారు. కెసిఆర్ పాలనలో 'సమగ్ర కుటుంబ సర్వే' పేరుతో జరిగిన సర్వే వివరాలను నాటి కెసిఆర్ ప్రభుత్వం బయటపెట్టలేదు. ఆ నివేదికలను రహస్యంగా ఎందుకు ఉంచారన్న ప్రశ్నకు బిఆర్ఎస్ వైపు నుంచి సరైన జవాబు లేదు.

రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావాలంటే ఏ కులం వారు ఎందరు ఉన్నారన్న లెక్క తేలవలసిందే. బిఆర్ఎస్, బిజెపి అభ్యంతరాలు హేతుబద్ధంగా లేవు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులాల లెక్కలు సమగ్రంగా లేవు. కేవలం ఎస్సీ,ఎస్టీల లెక్కలు మాత్రమే ఉన్నాయి. ఇతర కులాల లెక్కలు ఉండవు. దీంతో స్థానిక సంస్థలైన పంచాయితీలు, మునిసిపల్ స్థాయి సంస్థల్లో బిసిలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు లభించడం లేదు. 2023 తెలంగాణ ఎన్నికల ముందు 'బిసి డిక్లరేషన్' పేరుతో కామారెడ్డిలో జరిగిన సభలో బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. జాతీయ స్థాయిలో కులగణనను కాంగ్రెస్ పార్టీ ఒక ఎజెండాగా పెట్టుకున్నందున తెలంగాణ నుంచి శ్రీకారం చుట్టారు.

పిసిసి అధ్యక్ష్య పదవిని బిసిలకు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ బిసిల పక్షపాతిగా చెప్పుకోవడానికి ఆస్కారం ఏర్పడింది. అటువైపు బిఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నేత, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులన్నీ ఒక సామాజిక వర్గానికే లభించాయి. బిజెపి తెలంగాణ అధ్యక్షుడు, శాసనసభలో ఆ పార్టీ నాయకుడు 'రెడ్డి' సామాజికవర్గం కావడం ప్రతిపక్షాలకు మైనస్‌గా భావిస్తున్నారు. గత ఎన్నికల్లో బిసి ఓటు బ్యాంకులు బిఆర్ఎస్ కోల్పోయిందన్న విశ్లేషణలున్నవి. ఇక కులగణనతో బిఆర్ఎస్ ను రేవంత్ సులభంగా ఆత్మరక్షణలో పడేశారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

దళితబంధు పథకం కొనసాగేనా?

దళితుల ఆర్థిక పురోగతి కోసం ప్రవేశ పెట్టిన ''దళిత బంధు పథకం'' కొనసాగేనా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దళిత బంధు పథకం ఉన్నట్టా.... లేనట్టా అన్న భావన ఆ వర్గాల్లో నెలకొంది. ఆర్థికంగా చితికిపోయి జీవన స్థితిగతులలో మార్పు నోచుకొని దళితులు, దళిత శ్రామికకులాల్లో వెలుగు నింపేందుకు గత ప్రభుత్వం ఘట్టహాసంగా దళిత బంధు పథకం ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఉపాధి ఉద్యోగావకాశాలు లేక శ్రమను నమ్ముకొని బ్రతుకు బండి లాగుతున్న దళితులకు ఉపాధి కల్పంచేందుకు గత ప్రభుత్వం 10లక్షల ఆర్థిక సహాయానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 మాసాలు గడిచినా 'దళిత బంధు పథకం' అమలు చేస్తామన్న విధాన ప్రకటన చేయలేదు. పథకం కొనసాగేనా అన్న అనుమానాలు బలంగా వ్యక్తం అవుతున్నాయి. 2021 హుజూరాబాద్ ఎన్నికల నేపథ్యంలో దళితులు ఎక్కువగా వున్న క్రమంలో దళితబంధు పథకం పేరుతో పథకాన్ని ప్రవేశ పెట్టింది. దళితుల సాధికారితే లక్ష్యంగా చెప్పుకుంటూ ప్రతి దళిత కుటుంబానికి 100 శాతం గ్రాంటుతో రూ॥. 10 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. 2021–22, 2022–2023 ఫిబ్రవరి నాటి కి 38వేల 328 కుటుంబాలకు దళిత బంధు పథ కం క్రింద రూ.10లక్షల లబ్ది చేకూరింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 59 కులాలు ఎస్.సి. జాబితాలో ఉన్నాయి. జనాభాలో 23 శాతం ఉండగా, 15 శాతం రిజర్వేషన్లు అమలు అవుతోంది. అయ్యావార్లు దాసరి, బంబాల, కాటికాపరులు, గుర్రలవాళ్ళు, మాదిగ బైండ్ల, దక్కలి, దొమ్మరి, పాము ల, సిందు మాదిగ, వంటి దళిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి దయనీయ జీవితా లు సాగిస్తున్నారు. 80లక్షల మంది దళితులు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నట్లు అంచనా. ప్రభుత్వాలు ఏ పథకం ప్రవేశపెట్టిన రాజకీయ ప్రయో జనం ఉంటుందని... దళితుల ఆత్మ గౌరవం పెరగాలంటే ''భూమిని జాతీయం'' చేయాలని భారత రత్న రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఏనాడో పేర్కొన్నారు.

118 నియోజక వర్గాల్లో 1110ల దళిత కుటుంబాల చొప్పున అంటే 1,29,800 కుటుంబాలకు ఈ పథకం క్రింద రూ॥10 లక్షలు అందిస్తామని గత ప్రభుత్వం ప్రటించింది. కాని ఎప్పటిలోగా అందిస్తామన్న విషయంపై నాటి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రెండవ దశలో 8 శాతం దళిత కుటుంబాలకు లబ్ది చేకూరుస్తామని గత ప్రభు త్వం ప్రకటించింది. 17 లక్షల దళిత కుటుంబాలకు లబ్ది చేకూరలంటే ఎన్ని ఏళ్లు పడుతుందో ప్రభుత్వం అంచనా వేయలేక పోయింది. 2022 –23 ఆర్థిక సంవత్సరానికి 17లక్షల 700 కోట్ల రూపాయాలు వార్షిక బడ్జెట్‌లో కేటాయించింది. అన్ని కోట్లు కేటాయించిన దళిత బంధు పథకం కింద దళితులు రూ.10 లక్షలు లబ్ది చేకూరలేదు. దళితులకు 10లక్షల లబ్ది చేకూరగా ప్రజా ప్రతినిధులు 30 శాతం దండుకున్నారన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. 27 ఏప్రిల్ 2023న జరిగిన విస్తృత సమావేశంలో పాల్గొన్న నాటి ముఖ్యమంత్రి కెసిఆర్. కొందరు శాసన సభ్యులు 30శాతం తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని బాహాటంగా ప్రకటించారు. పథకం దళితుల ఆర్థిక అభ్యన్నతి కోసం ప్రవేశ పెట్టినప్పటికి ఆ లక్ష్యాలు పూర్తిస్థాయిలో సాధించలేదని చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 9న అధికారాన్ని చేపట్టింది. 10 నెలలు గడిచిన దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తామని... దళితు ల ఆర్థిక పురోభివృద్ధికి పాటుపడుతామని అధికారికంగా ప్రకటన చేయలేదంటే పథకం అమలుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత ప్రభు త్వం వార్షిక బడ్జెట్‌లో 17,700 కోట్లు కేటాయించిన దళితులకు 10లక్షల అందచేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024–25 తాత్కాలిక బడ్జెట్ ను గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టినప్పటికి దళిత బంధు పథకం కోసం కేటాయింపులు చేయలేదు. జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 2024–25 సం.నికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం దళిత బంధు పథకం అమలుకోసం నిధులు కేటాయించలేదు. దీంతో పథకం అమలు కొనసాగే పరిస్థితి కనిపించడం లేదన్న ఆందోళనలో మునిగిపోయారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న 18 వేల కోట్ల రూపాయల ఆదాయం అప్పుల వడ్డీలకు, ఇతర సంక్షేమ పథకాల అమలుకు, ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నెల వస్తుందంటే నిధులు ఎలా సమాకూర్చుకోవాలన్న ఆందోళన ప్రభుత్వ పెద్దలకు తలనొప్పిగా మారింది. దళితబంధు కొనసాగేనా తమ జీవితాల్లో వెలుగు లు నిండేనా అనుమానాలు ఆ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

గుర్రం రాంమోహన్ రెడ్డి
7981018644

'అపార్' నమోదులో అపార సమస్యలు

లేఖ

కేంద్రం తెచ్చిన అపార్ కార్డు నమోదులో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అపార్ కార్డు నమోదు కోసం ఆధార్ కార్డును ఉపయోగిస్తున్నారు. అయితే నమోదు సమయంలో ఆధార్ కార్డులో వివరాలు, అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లో వివరాలతో పోలిస్తే తప్పుగా ఉండటంతో సమస్యలు వస్తున్నాయి. దీంతో ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవాల్సి వస్తోంది. ఆధార్ కార్డులో పుట్టినరోజు, తండ్రి పేరు వంటి వివరాలు మార్చాల్సి వస్తే.. బర్త్ సర్టిఫికేట్ కావాల్సి వస్తోంది. దీంతో బర్త్ సర్టిఫికేట్ లేని గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండల రెవెన్యూ ఆఫీస్ చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. ఇదే అదనుగా నోటరీలు డబ్బు వసూలు చేస్తున్నారు. ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లలో విపరీతమైన రద్దీ, విద్యార్థుల నుండి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. దేశంలో పౌరులకు గుర్తింపు కార్డుగా ఆధార్ కార్డు ఉన్నట్లే.. ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో కేంద్రం విద్యార్థుల కోసం అపార్ తీసుకొచ్చింది. జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తీసుకువచ్చింది. ప్రతి విద్యార్థికి 'అపార్' కార్డు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కెజి నుంచి పిజి వరకు చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. కార్డుపై క్యూఆర్ కోడ్‌తో పాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. అపార్‌తో ఎక్కడి నుంచైనా ప్రవేశాలు పొందవచ్చు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో తొమ్మిది, పదో తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు ఈ కార్డులు జారీ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వన్ నేషన్‌వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ అపార్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. కెజి నుంచి పిజి వరకు చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. సరిగ్గా ఇదే తరహా లో విద్యార్థులకు కూడా గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నారు. సమాచార గోప్యత అనేది లేకుండా ఉంది, ఆధార్, అపార్, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు అన్నీ లింక్ అయి ఉంటా యి. అపార్ వివరాలు సేకరించే ఏజెన్సీ ఎవరికైనా విక్రయిస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మాత్రం విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫోటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్యతో పాటు ఆ విద్యార్థి మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, అవార్డులు, డిగ్రీలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు విద్యా సంబంధిత వివరాలతో సమగ్ర రికార్డును అందుబాటులో ఉంది. మరోవైపు విద్యార్థుల ఆధార్ సమస్యలు పరిష్కరించేందుకు ఇటీవల అక్టోబర్ 22 నుంచి 25 వరకూ ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కేంద్రాల్లో కేవలం ఫోన్ నంబర్ అప్‌డేట్ వంటి చిన్న చిన్న సమస్యలను మాత్రమే కరెక్షన్స్ చేస్తున్నారు. తండ్రి పేరు, పుట్టినరోజు వివరాల్లో తప్పులు ఉంటే కరెక్షన్ చేసేందుకు బర్త్ సర్టిఫికేట్లు అడుగుతున్నారు. నిరక్షరాస్యత, బర్త్ సర్టిఫికేట్‌కు దరఖాస్తు చేసుకోకపోవటమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో అపార్‌లో నమోదు చేసేముందు ఆధార్ కార్డులో, స్కూలు అడ్మిషన్ రిజిస్టర్‌లో వివరాలు ఒకేలా ఉన్నాయో లేదో సరిచూసుకోవటం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

దేశం చిన్నదే...కానీ సంపన్నం

ఎస్.బాబు, అధ్యక్షుడు
టిఎస్

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 07, సంచిక: 337 | శుక్రవారం | 08-11-2024 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

హుస్నాబాద్‌కు.. పారిశ్రామిక కారిడార్

రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి

రాష్ట్రంలో 9 మంది డిఎస్‌పిల బదిలీలు

లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 337 | శుక్రవారం | 08-11-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

ఫిర్యాదు చేసేందుకు వెళితే

చితకబాదిన కానిస్టేబుల్

బాధితుడు ఆత్మహత్య

ప్రజాపక్షం/అల్లాదుర్గం

కానిస్టేబుల్ కొట్టాడని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాంపూర్ గ్రామానికి చెందిన తలారి కిషన్ (36) అనే యువకుడు తన సెల్ ఫోన్ పోయిందని, పోలీస్ తరువాయి 6లో

ఎసిబికి చిక్కిన డిఇఒ రవీందర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి

ఉపాధ్యాయురాలి సీనియారిటీ విషయంలో లంచం తీసుకుంటూ మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డిఇఒ రవీందర్ ఎసిబి అధికారులకు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఎసిబికి చిక్కిన డిఇఒ రవీందర్ వ్యవహారం ఉపాధ్యాయ వర్గాల్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మహబూబ్‌నగర్ ఎసిబి డిఎస్‌పి కృష్ణగౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయుల పదోన్నతుల సందర్భంగా ఒక ఉపాధ్యాయురాలుకు దక్కవలసిన ప్రమోషన్ మరో ఉపాధ్యాయురాలుకు దక్కింది. అయితే సీనియారిటి, రిజర్వేషన్ ప్రకారం, తనకి దక్కాలని తరువాయి 6లో

ఉద్యోగాల నియామక వేళ..

మధ్యలో రూల్స్ మార్చేందుకు వీల్లేదు

'సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకానికి సంబంధించిన 'రూల్స్ ఆఫ్ గేమ్' ప్రక్రియ అనుమతిస్తే తప్ప మధ్యలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ఇష్టమొచ్చినప్పుడల్లా మార్చేందుకు వీలులేదని గురువారం సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసు విచారణ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ మొదలైన తర్వాత ముందస్తుగా చెప్పకుండా మధ్యలో నిబంధనలు మార్చడానికి వీల్లేదని స్పష్టంచేసింది. నియామక ప్రక్రియ దరఖాస్తులను స్వీకరించేందుకు ఒక అడ్వర్టైజ్‌మెంట్ జారీచేసి పిలువడంతో ప్రారంభమై, వెకెన్సీలను భర్తీ చేయడంతో ముగుస్తుందని తెలిపింది. 'ప్రస్తుతం ఉన్నటువంటి నిబంధనలు అనుమతిస్తే లేదా ప్రస్తుతం ఉన్న నిబంధనలకు విరుద్ధంగా లేని అడ్వర్టైజ్‌మెంట్స్‌ను అనుమతిస్తే తప్ప తరువాయి 6లో

ఆటమ్ బాంబు పేలబోతోంది...

రూ. 55 కోట్ల లెక్క తేల్చుతాం

- అక్రమమార్గంలో విదేశాలకు జనం సొమ్ము
- ఎంత పెద్దవాళ్లకైనా చట్టం చుట్టం కాదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

ప్రజా పక్షం /రాయపర్తి/ వర్ధన్నపేట

త్వరలో ఆటమ్‌బాంబు పేలుతుందంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'తప్పు చేసిన వాళ్లకు నాటు బాంబు కాదు.. లక్ష్మీ బాంబు కాదు.. ఆటమ్‌బాంబు పేలబోతోంది. జనం సొమ్మును అక్రమమార్గంలో విదేశాలకు పంపారు. ఎంత పెద్దవాళ్లకైనా చట్టం చుట్టం కాదు. రూ.55 కోట్లు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయో తేలుస్తాం. తప్పు చేయనివాళ్లు ఉలిక్కిపడాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. గురువారం వరంగల్ జిల్లా రాయపర్తిలో, వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రభుత్వచీఫ్ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, స్థానిక తరువాయి 6లో

'ఫార్ములా-1 ఇ -రేస్' కోసం రూ.55 కోట్లు

చెల్లించమని... నేనే చెప్పా

- నన్ను జైల్లో పెట్టినా ఒరిగేదేమీ లేదు... జైల్లో ఉండి యోగా చేసి ట్రిమ్‌గా మారుతా
- నాటి మున్సిపల్ ముఖ్యకార్యదర్శి తప్పేమీ లేదు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఫార్ములా1 ఈ రేస్' నిమిత్తం రూ.55 కోట్లను చెల్లించేందుకు మంత్రివర్గ అనుమతి అవసరం లేదని, ఆ డబ్బులను చెల్లించాలని తానే అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్‌కు సూచించానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కెటి. రామారావు వివరించారు. తనను జైలులో పెట్టినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని, రెండు,మూడు నెలలు జైలులో ఉండి యోగా చేసి, ట్రిమ్‌గా మారుతానని, జైలు నుంచి బయటకు రాగానే పాదయాత్రకు వెళ్తానని తెలిపారు. ఎటువంటి విచారణకైనా తాను సిద్ధమేనని, ఉడుత ఊపులకు తాను భయపడబోనని కెటిఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఇ–రేస్' ప్రభుత్వ కార్యక్రమంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే రూ.55 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇందులో ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ తప్పు ఏమీ లేదని, ఈ మొత్తానికి బాధ్యత తనదేనన్నారు. మున్సిపల్ శాఖలో జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎలో అంతర్గతంగా నిధుల సర్దుబాటు చేసుకోవచ్చని, హెచ్ఎండిఎ ఇండిపెండెంట్ బోర్డు అని, ఈ బోర్డ్‌కు చైర్మన్‌గా సిఎం, వైస్ చైర్మన్‌గా పురపాలక శాఖ మంత్రి ఉంటారని వివరించారు. వాస్తవానికి హైదరాబాద్‌లో 'ఈ రేస్' రాకుండా హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీసినందుకు రేవంత్ రెడ్డిపైనే కేసు నమోదు చేయాలన్నారు. ఈ రేస్‌కు ఎసిబికి ఏం తరువాయి 6లో

నేడు సిఎం మూసీ పునరుజ్జీవ

సంకల్ప యాత్ర

ప్రజాపక్షం / హైదరాబాద్:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర'ను యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంగెం నుంచి నిర్వహించనున్నారు. రేవంత్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం తరువాయి 6లో

మూసీ ప్రక్షాళనతో పేదల స్థితి గతులు మారుస్తాం

- ప్రభుత్వ లక్ష్యమదే : మంత్రి తుమ్మల
- సిఎం మూసీ పాదయాత్ర నేపథ్యంలో సంగెం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు భట్టి, కోమటిరెడ్డి

ప్రజాపక్షం/యాదాద్రి

మూసీ ప్రక్షాళన ద్వారా లక్షలాది మంది పేదల జీవన స్థితిగతులను మార్చాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మూసీ పాదయాత్రను పురస్కరించుకొని గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా, సంగెం వద్ద ఏర్పాట్లను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ఉన్న మూసీ నది రానురాను మురికి కూపంగా మారిపోయిందని, గడచిన 42 సంవత్సరాలుగా ఎన్నో ప్రభుత్వాలలో పనిచేసిన అనుభవం తనకుందని, మూసీ ప్రక్షాళనకు అన్ని ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదని, కానీ ముఖ్యమంత్రి ఇది సాహసోపేతమైన చర్య అని అన్నారు. సాగునీటితో పాటు, తాగునీరు అందించడమే కాకుండా, మూసీ పరీవాహక ప్రాంతంలోని లక్షలాది తరువాయి 6లో

బెంగళూరులో 'హైడ్రా'

చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణపై అధికారుల బృందం అధ్యయనం

ప్రజాపక్షం/హైదరాబాద్

చెరువుల పునరుద్ధరణ, విపత్తుల నిర్వహణపై అధ్యయనానికి హైడ్రా అధికారుల బృందం బెంగళూరు పర్యటనకు తరలివెళ్లింది. బుధవారం హైడ్రా అధికారులు బెంగళూరు వెళ్లగా, గురువారం కమిషనర్ ఏవి. రంగనాథ్ అక్కడికి చేరుకున్నారు. బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్ర స్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, మురుగునీరు స్వచ్ఛంగా మార్చడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించిన విధానాలను పరిశీలించేందుకు కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా బృందం మూడు రోజుల పాటు బెంగళూరులో పర్యటిస్తుంది. అక్కడి చెరువుల పునరుద్ధరణపై సీనియర్ శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రముఖులతో సమావేశం కానున్నారు.

యెల్లంక చెరువును పరిశీలిన..

యెల్లంకలో ఉన్న కర్ణాటక స్టేట్ నాచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను హైడ్రా అధికారుల బృందం సందర్శించారు. నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ విపత్తు నిర్వహణపై సీనియర్ శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్స్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు. బెంగళూరు కోర్ సిటిలో ఉన్న చెరువులను సందర్శించారు. యెల్లంక, జాకూర్ చెరువులను పునరుద్ధరించిన తీరును పరిశీలించారు. చెరువుల్లోకి వస్తున్న మురుగు నీటిని ఎస్‌టిపిల ద్వారా చెరువులను నింపుతున్న విధానాన్ని, చెరువుల పునరుద్ధరణకు అనుసరిస్తున్న విధానాలను బృహత్ బెంగళూర్ మహానగర పాలిక(బిబిఎంపి) అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల పునరుద్ధరణకు పని చేస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. 'లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్ మల్లిగవాడ్‌తో సమావేశం కానున్న రంగనాథ్ కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గదోన్హల్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. ఇటీవల ఈ విషయాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆనంద్ మల్లిగవాడ్‌తో చర్చించిన రంగనాథ్ ప్రత్యక్షంగా వాటిని పరిశీలించడం తరువాయి 6లో

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

ఏటా వార్షిక 'జాబ్ క్యాలెండర్'ను విడుదల చేస్తాం : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక 'జాబ్ క్యాలెండర్'ను విడుదల చేశామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఎన్ని కల సమయంలో కాంగ్రెస్ ప్రకటించినట్టుగానే రాష్ట్రంలో ఖాళీగాఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. హైదరాబాద్,అశోక్ నగర్‌లో 'సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్'ను భట్టి విక్రమార్క మల్లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్షను విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ 2 పరీక్షలను కూడా నిర్వహించబోతున్నామని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు రాకుండా రాష్ట్రంలో విజయవంతంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి యుపిఎస్‌సి మెయిన్స్‌కు ఎంపికైన నిరుపేద,మధ్య తరగతి అభ్యర్థులకు, ఒక్కరి చొప్పున లక్ష రూపాయలను అందజేసి, వారిని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి వివరించారు. పోటీ తరువాయి 6లో

అక్టోబర్ విప్లవం

జాతీయ విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

అక్టోబర్ విప్లవం జాతీయ విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో గురువారం అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి ప్రసంగిస్తూ రష్యా విప్లవం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల, భూస్వాముల గుండెల్లో ప్రకంపనలు సృష్టించిందని అన్నారు. ప్రపంచ పరిణామాల దశను, దిశను మార్చి ప్రపంచ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘటన అక్టోబర్ విప్లవమని కొనియాడారు. బాలమల్లేశ్ ప్రసంగిస్తూ అక్టోబర్ విప్లవం కష్టజీవుల ఆశాజ్యోతిగా నిలిచిందని అన్నారు. 1886 తర్వాత ఎనిమిది గంటల పని దినం కోసం సాగుతున్న ప్రపంచ కార్మికవర్గ పోరాటాలకు, బహుశా కార్మిక రాజ్యం సోవియెట్ లోనే పరిష్కారం దొరికిందని అన్నారు. అక్టోబర్ విప్లవం తర్వాత అధికారంలోకి రాగానే ఎనిమిది గంటల పని దినం చట్టపరంగా అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. సామాజిక భద్రత అంశాలు అనేకం అమల్లోకి వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కెవియల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, అరసం రాష్ట్ర అధ్యక్షులు రాపోలు సుదర్శన్, సిపిఐ నాయకులు జి.చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అప్పుడే... వణికిస్తున్న చలి

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో చలి తీవ్రత అప్పుడే మొదలైంది. నవంబర్ మొదటి వారం నుంచే చలి విజృంభిస్తోంది. ఇంతకాలం వర్షాలు, ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలను ఇప్పుడు చలి వణికిస్తోంది. గరిష్ట ఉష్ణోగ్రతలతో పాటు కనీష్ట ఉష్ణోగ్రతలు సైతం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా సాయంత్రం 5 గంటల నుంచే చలి తీవ్రత కనిపిస్తోంది. దీంతో 6 గంటల తర్వాత వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 డిగ్రీలకుపైగా ఉండాల్సిన గరిష్ట ఉష్ణోగత్ర పలు ప్రాంతాల్లో 28 డిగ్రీలకు పడిపోయింది. ఇది సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువ కావడంతో సాయంత్రం 5 గంటల నుంచే చలి తీవ్రత కనిపిస్తోంది. మరోవైపు కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం పలు ప్రాంతాల్లో 16 నుంచి 18 డిగ్రీల మధ్య నమోదు అవుతున్నాయి. దీంతో రాత్రి వేళ ఒక్కసారిగా పెరిగిన చలి తీవ్రత ప్రజలను వణికిస్తోంది. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. గురువారం మెదక్ జిల్లాలో 16 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో కనిష్ట ఉష్ణోగ్రత 16.2 తరువాయి 6లో

జమ్ముకశ్మీర్ అసెంబ్లీ

'రణరంగం'

ప్రత్యేక హోదా తీర్మానం ఆమోదంపై బిజెపి సభ్యుల వాగ్వాదం : సభలో గందరగోళం

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా తీర్మానంపై జమ్ముకశ్మీర్ అసెంబ్లీ గురువారం రణరంగంగా మారింది. ప్రత్యేక హోదా తీర్మానంపై అసెంబ్లీ సమావేశంలో నిరసన సందర్భంగా వెల్‌లోకి దూసుకెళ్లిన విపక్ష సభ్యులను బయటకు పంపాలని స్పీకర్ ఆదేశించడంతో బిజెపి సభ్యులు అగ్రహోదగ్రులయ్యారు. ఇది పెద్ద గొడవకు దారితీసింది. బిజెపి ఎమ్మెల్యేలు, మార్షల్స్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ అబ్దుల్ రహీమ్ కనీసం ముగ్గురు ఎమ్మెల్యేలను బయటికి తీసుకెళ్లాలని మార్షల్స్‌కు ఆదేశాలు జారీచేయడంతో వారిని మార్షల్స్ తీసుకెళ్లకుండా విపక్షసభ్యులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సభలో పెద్ద తోపులాట జరిగింది. మార్షల్స్‌తో వాగ్వాదానికి దిగారు. పెద్ద గొడవ మధ్య పరిస్థితి ఎంతకూ అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ అబ్దుల్ రహీమ్ సభా కార్యక్రమాలను రోజంతా వాయిదా వేశారు. సభ తరువాయి 6లో

కుప్పకూలిన జర్మనీ సంకీర్ణ ప్రభుత్వం

జనవరిలో విశ్వాస పరీక్ష

బెర్లిన్ : ఒకవైపు ప్రపంచమంతా అమెరికా ఎన్నికల ఫలితాలను, తదుపరి పరిణామాలను విశ్లేషణ చేస్తుంటే మరోవైపు జర్మనీలో సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. వచ్చే ఏడాది జనవరినెలలో పార్లమెంటులో విశ్వాస పరీక్షకు నిలబడుతుందని జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ ప్రకటించారు. పరిస్థితులు సహకరించకపోతే సత్వర ఎన్నికలకు అవకాశం ఉందన్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో ఆర్థికమంత్రి క్రిస్టియన్ లిండర్‌ను పదవినుండి తొలగించడంతో ప్రభుత్వం కుప్పకూలింది. ఐతే షుల్జ్, లిండర్‌మధ్య పరస్పర విమర్శలు ఆరోపణలు కొనసాగాయి. ఈ సంకీర్ణ ప్రభుత్వంలో మూడు భాగస్వామ్యపార్టీలు ఉన్నారు. వ్యాపార అనుకూల ఫ్రీ డెమోక్రాట్స్‌కు చెందిన మంత్రి లిండర్స్. ఆ పార్టీపైనే ప్రధానంగా ఈ సంకీర్ణ కూటమి ఆధారపడింది. షుల్జ్‌కు చెందిన సోషల్ డెమోక్రాట్స్, ఎన్విరాన్‌మెంటల్ గ్రీన్స్ పార్టీలు కూడా ఈ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. కొద్దివారాలుగా భాగస్వామ్యపార్టీలమధ్య విభేదాలు కొనసాగుతున్నాయని పత్రికాగోష్ఠిలో ఓలాఫ్ షుల్జ్ చెప్పారు. దేశానికి తీవ్ర నష్టం జరగకుండా ఉండేదుకే అనివార్యమైన పరిస్థితుల్లో తాను ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. దేశంలో ఆర్థిక సమస్యలు పరిష్కరించడానికి ఒక సమర్థవంతమైన ప్రభుత్వం జర్మనీకి కావాలని, దేశానికి అవసరమైన తక్షణ నిర్ణయాలను తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశంలో పన్నుల పెంపుదలకుగానీ, తరువాయి 6లో

హుస్నాబాద్‌కు..పారిశ్రామిక కారిడార్

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి : మంత్రి పొన్నం
పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుస్నాబాద్ /అక్కన్నపేట : హుస్నాబాద్ అభివృద్ధి కోసం పారిశ్రామిక కారిడార్‌ను తీసుకువస్తామని, దీనితో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, దీనితో పాటు హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అభివృద్ధికే కేరాఫ్ హుస్నాబాద్ అనేవిధంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పలు అభివృద్ధి పనులతో పాటు పారిశ్రామిక కారిడార్ పరిశ్రమకోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలో రూ.2కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్కన్నపేట మండల పరిధిలోని చౌటపెల్లి గ్రామ శివారులో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయుటకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పారిశ్రామిక స్థలం సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి సంబంధిత అధికారులకు బదిలీచేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నా నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటీ హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయుటకు అనేక ప్రణాళికను రూపొందిస్తున్నామని అన్నారు. పట్టణంలోని గాంధీ, అంబేద్కర్, నాగారం, కరీంనగర్ రోడ్డుతో పాటు 4 చౌరస్తాల్లో రూ.50లక్షల చొప్పున కేటాయించి ముఖ్యమైన నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసుకునివాటితో పాటు బుడగ జంగాల కాలనీలో ఇందిరాగాంధీ విగ్రహంను ఏర్పాటు చేసి అన్ని చౌరస్తాలను అభివృద్ధిపరుస్తామని అన్నారు. అలాగే 18 కోట్లాతో ఎల్లమ్మ చెరువు బండ్ అభివృద్ధికి టెండర్లు అయినట్లు తెలిపారు. ఈ పనులన్నింటికీ ముఖ్యమంత్రి లేదా ఉపముఖ్యమంత్రిచే శంకుస్థాపన చేయిస్తామని అన్నారు. పూర్తి అయిన భవనాలను ప్రారంభిస్తామని, హుస్నాబాద్ పట్టణంలలో నిర్మాణాలు పూర్తిచేసుకుని ప్రారంభాలకు సిద్ధంగా ఉన్న మున్సిపల్ భవనం, ఎసిపి, మార్కెట్ లైబ్రరీతో పాటు 4 వరుసల కరీంనగర్ రహదారి పనులకు శంకుస్థాపన చేయిస్తామని అన్నారు. వీటితో పాటు 150 పడకల అనుపత్రి, సర్వాయి పాపన్నటూరిజం అభివృద్ధి, మహాసముద్రం అభివృద్ధిపనులకు ఒకేసారి శంకుస్థాపన చేస్తామన్నారు. హుస్నాబాద్‌కు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రామ్మూర్తి, మున్సిపల్ చైర్మెన్ రజిత వెంకన్న, గ్రంథాలయ కమిటీ చైర్మెన్ కేడం లింగమూర్తి సహకార సంఘం చైర్మెన్ బొల్లిశెట్టి శివయ్య, వైస్ చైర్మెన్ అనితారెడ్డితో పాటు అధికారులు, కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి

ఎన్ఆర్ఐలు, పెట్టుబడిదారులకు మంత్రి జూపల్లి పిలుపు
లండన్‌లో.. ప్రపంచ పర్యాటక ప్రదర్శన ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ), పెట్టుబడిదారులకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. లండన్‌లో జరుగుతున్న ప్రపంచ పర్యాటక ప్రదర్శన ముగింపు వేడుకల్లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కలిసి జూపల్లితో పాటు పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ నేరెళ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంఎల్ఏలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, డా.వంశీ కృష్ణ, అనిరుధ్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్‌లు పాల్గొన్నారు. తెలంగాణ స్టాలను షెకావత్ సందర్శించారు. లండన్ వేదికగా మూడురోజుల పాటు జరిగిన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకల్లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను షెకావత్ సందర్శించారు. బతుకమ్మ వేడుకలను తిలకించారు.

మంత్రి జూపల్లి షెకావత్‌ను సన్మానించి, చార్మినార్ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. అద్భుతమైన ప్రదేశాలు, చరిత్ర, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిసేవిధంగా ఈ వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో తగిన ప్రచారం చేశామని అన్నారు. తెలంగాణలోని రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, చార్మినార్, సోమశిల, బుద్ధవనం, వేయి స్తంభాల గుడి, చారిత్రక వరంగల్ కోట వంటి ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాల ఛాయాచిత్రాల ప్రదర్శనను డబ్ల్యు టిఎం వేదికగా ప్రదర్శించామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పురావస్తు కట్టడాలను తిలకించేందుకు పర్యాటకులు అత్యంత ఆసక్తి చూపిస్తారని, తెలంగాణలోని ప్రసిద్ధ పురావస్తు కట్టడాల సందర్శనకు ఈ ప్రదర్శన ఫలితంగా పర్యాటకులు భారీగా పెరుగుతారని అంచనా వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. విదేశీ పర్యాటకుల తాకిడి పెరిగి పర్యాటక రంగం అభివృద్ధి చెందడం వల్ల రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రసిద్ధ గ్రీన్‌విచ్‌లో నిర్వహించిన చలో ఇండియా కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, యూకేలో భారత హై కమిషనర్ విక్రమ్ దురైస్వామి, కేంద్ర పర్యాటక శాఖ డిజి ముగ్ధ సిన్హా, గోవా పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖంటే, ఒడిషా డిప్యూటీ సిఎం ప్రవతి ఫరీదాతో పాటు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను కూడా పర్యవేక్షించాలి : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను సైతం పర్యవేక్షించాలని వ్యవసాయం, మార్కెటింగ్, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం సచివాలయంలో రాష్ట్రంలో కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు కార్యకలాపాలపై మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తు రాష్ట్రంలో మేజర్ మార్కెట్ కమిటీలను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి సమగ్ర వివరాలు అందించే విధంగా ఒక వెబ్ పోర్టల్ రూపొందించామని, ఇందులో సిసిఐ ఇప్పటి వరకు ఎంత పత్తిని కొనుగోలు చేసింది, ఎంత పత్తిని తిరస్కరించిది పూర్తి వివరాలను ఇందులో పొందుపరచడం జరిగిందని చెప్పారు. మార్కెటింగ్ అధికారులు, ప్రాంతీయ అధికారులు జిన్నింగ్ మిల్లులను ఎప్పటిప్పుడు ఆకస్మిక తనిఖీలు చేసి, రిపోర్టును డైరెక్టర్ మార్కెటింగ్ శాఖకు అందించాలని ఆదేశించారు. మార్కెటింగ్ కేంద్రాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని దగ్గరలోని సిసిఐ సెంటర్లలోనే పత్తిని అమ్ముకోవాలని మంత్రి రైతులకు సూచించారు. రైతులు పత్తిలో తేమశాతం 8 నుండి 12 మధ్యలో ఉండేలా చూసుకోవాలని తద్వారా అధిక మద్దతు ధరను పొందవచ్చని తెలిపారు. అలాగే పత్తి అమ్ముకోవడంలో రైతులకు ఏమైన సమస్యలు ఎదురైతే ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ చాట్ యాప్ సెల్ నంబర్ 8897281111 ద్వారా తెలియజేయగలరని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను కోరారు.

జన గణనలో కులగణన చేపట్టాలి

బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి
జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం /ఖైరతాబాద్ : దేశవ్యాప్త జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా డిసెంబర్‌లో లక్షలాది మంది బిసిలతో ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన సంఘం కోర్ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకేరోజులో బిల్లు పెట్టి ఆగమేఘాల మీద 10శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారని, కానీ, చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని 30 ఏండ్లుగా పోరాడుతున్న బిసిలను కేంద్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బిసిలకు గొర్రెలు, బర్రెలు, పందులు, పెన్షన్లు ఇస్తూ బిసిలను బిచ్చగాళ్లుగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 56 శాతం జనాభా కలిగిన బిసిలకు రాజ్యాధికారంలో వాటా పంచకుండా ఎన్నిరోజులు అన్యాయం చేస్తారని ప్రశ్నించారు. 16 రాష్ట్రాల నుండి ఒక్క బిసి పార్లమెంట్ సభ్యుడు కూడా లేరన్నారు. ప్రస్తుత లోక్‌సభలో 545 మంది సభ్యులుండగా, వీరిలో 96 మందే బిసి సభ్యులు ఉన్నారని, ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ ప్రశ్నించారు. కేంద్ర విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను బిసి.ల జనాభా ప్రకారం 27శాతం నుండి 56 శాతానికి, పంచాయతీరాజ్ సంస్థలో 22 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఎపి బిసి సంఘం మహిళా విభాగం ఇన్‌చార్జి నూకలమ్మ, జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు, నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేశ్, బిసి ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేశ్, రాందేవ్ మోదీ, వరప్రసాద్, ప్రసన్న నేతలు పాల్గొన్నారు.

విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి

టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం / హైదరాబాద్ : విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పరిపాలన చేసిన మాజీ సిఎం కెసిఆర్‌పై పోరాటం చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఆయన అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి రచించిన 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని గాంధీభవన్‌లో మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున సిఎం రేవంత్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మహేష్‌కుమార్ ఆకాంక్షను వ్యక్తం చేశారు.

తెలంగాణకే గర్వకారణం

దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణగోపురం లక్ష్మీ నరసింహ స్వామి వారిదే
బంగారు తాపడం పనుల వివరాలను వెల్లడించిన మంత్రి కొండాసురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం యాదగిరిగుట్ట పర్యటన నేపథ్యంలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ (వైటిడిఎ), దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించిన మంత్రి సురేఖ దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణగోపురం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిదే కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణలోని దేవాలయాలను పరమ పావన క్షేత్రాలుగా, ప్రశాంత నిలయాలుగా తీర్చిదిద్దేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కెఎస్ శ్రీనివాస రాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత్ కొండిబా, వైటిడిఎ వైస్ చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషన్ రావు, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ లు కృష్ణవేణి, జ్యోతి, ఆర్జేసి రామకృష్ణారావు, యాదగిరి గుట్ట ఈవో భాస్కర్ రావు, వైటిడిఎ ఎస్టేట్ ఆఫీసర్ సంతోష్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విమాన గోపురం బంగారం తాపడం పనుల వివరాలను మంత్రి ఆరా తీయగా మొత్తం 10 వేల చదరపు అడుగుల బంగారం తాపడం సంబంధిత పనులకు గాను నేటి వరకు 1600 చదరపు అడుగుల పని పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు. 15 నవంబర్, 2024 నుండి విమాన గోపురానికి బంగారు తాపడం అమర్చే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. బంగారు తాపడం నిమిత్తం 60 కిలోల బంగారం, గోల్డ్ ప్లేటింగ్ తయారీ, ఫిక్సింగ్ ఛార్జీలకు కలిపి మొత్తం రూ. 8 కోట్లను వెచ్చిస్తున్నట్లు వివరించారు. 1 మార్చి, 2025 నుండి స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉన్నందున ఈ లోపే పనులు పూర్తి చేయాలని మంత్రి సురేఖ ఈవోను ఆదేశించారు. పనులు పూర్తయిన తర్వాత విమాన గోపురానికి సీఎం రేవంత్ రెడ్డి మహా కుంభాభిషేకం జరిపిన తర్వాత బ్రహ్మోత్సవాలను నిర్వస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో యాదగిరి గుట్ట దేవాలయాభివృద్ధి పై జరుగుతున్న సమీక్షా సమావేశంలో అన్ని వివరాలు సమర్పించాలని ఈవోను మంత్రి ఆదేశించారు. వైటిడిఎ ఆధ్వర్యంలో దేవాలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి మొత్తం 1241.36 ఎకరాల భూమి సేకరించినట్టుగా వైటిడిఎ వైస్ ఛైర్మన్ కిషన్ రావు మంత్రి సురేఖకు తెలిపారు. యాదగిరి గుట్ట దేవాలయ భవిష్యత్ అవసరాల నిమిత్తం సేకరించాలనుకున్న 101.10 ఎకరాల భూమికి సంబంధించిన ఫైలు ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనుమతుల నిమిత్తం వారి కార్యాలయంలో వున్న విషయాన్ని వైస్ ఛైర్మన్ తెలుపగా, మరోసారి సమీక్షించిన తర్వాత భూమిని సేకరించేది లేనిది తెలియజేస్తామని మంత్రి సురేఖ వైస్ ఛైర్మన్ కు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 9 మంది డిఎస్‌పిల బదిలీలు

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణలో 9 మంది డిఎస్‌పిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం డిజిపి డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారివివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

అధికారిపేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.మహేష్‌బాబు	జగిత్యాల	కరీంనగర్ పిటిసి
బి.రామానుజం	కరీంనగర్ పిటిసి	కాగజ్‌నగర్ ఎస్
ఎ.కరుణాకర్	కాగజ్‌నగర్ ఎస్‌డిపిఒ	ఆసిఫాబాద్ ఎస్‌డిపిఒ
కె.క్రిష్ణ	వనపర్తి, డిసిఆర్‌బి	తొర్రూర్ ఎస్‌డిపిఒ
పి.రవీందర్‌రెడ్డి	నిర్మల్ డిసిఆర్‌బి	ఖమ్మం, సిసిఆర్‌బి
డి.ప్రసన్న	ఖమ్మం సిసిఆర్‌బి	మెదక్ ఎస్‌డిపిఒ
ఎస్ఆర్ దామోదర్‌రెడ్డి	వెయిటింగ్	అంబర్‌పేట,పిటి
సిపి.సైదయ్య	అసిఫాబాద్ ఎస్‌డిపిఒ	తొర్రూర్ ఎస్‌డిపిఒ
విసురేష్	తొర్రూర్ ఎస్‌డిపిఒ	డిజిపి ఆఫీస్ రిపోర్టు

వాస్తు పిచ్చితో సచివాలయ గేటు మార్పు: హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రీన్ టెక్నాలజీ,అగ్నిమాపక భద్రత నిబంధనలతో దేశానికే తలమానికంగా కొత్త సచివాలయాన్ని నిర్మిస్తే, వాస్తు పిచ్చితో సిఎం రేవంత్ రెడ్డి గాయ్ గత్తెర చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సచివాలయంలో పూటకో మార్పు చేస్తున్నారని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తు దోషం పేరుతో ఒక్క గేట్ మార్పు చేయడానికే రూ 4 కోట్లు ఖర్చు పెడుతున్నారని మండిపడ్డారు.

కుటుంబ సమేతంగా నేడు యాదాద్రికి సిఎం

మూసీ పునరుజ్జీవం కోసం వలిగొండ మండలం సంగెం నుంచి భీమలింగం కాలువ వరకు రేవంత్ పాదయాత్ర

ప్రజాపక్షం/యాదాద్రి ప్రతినిధి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనార్థం వస్తున్నారు. సీఎం రాక సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య అధికారులతో కలిసి ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు కావలసిన ఏర్పాట్లను గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు, యాదాద్రి భువనగిరి జిల్లా డిసిపి రాజేష్ చంద్ర, ఆలయ ఈవో భాస్కర్ రావులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి యాదగిరిగుట్ట కొండ కింద పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ ద్వారా యాదాద్రి కొండపైకి వెళ్తారు. కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీ నరసింహ స్వామి గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకుంటారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య పర్యవేక్షించారు. స్వామి దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి వైటిడిఏ అధికారులతో ఆలయ పురోగతి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమీక్ష నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి అధికారులు నివేదికను సిద్ధం చేశారు. యాదాద్రి దేవాలయంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, జరగవలసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డికి వివరించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేశారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాల్సిన అంశాల గురించి అధికారులకు ఎమ్మెల్యే అయిలయ్య నిర్దేశం చేశారు. ఈ యాదగిరిగుట్ట అభివృద్ధితో పాటు స్థానికుల జీవన ప్రమాణాలను పెంచే విధంగా చేపట్టాల్సిన పనుల విషయమై వైటిడిఏ అధికారులకు సూచనలు చేసి వాటిని సీఎంకు వివరించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యాదగిరి కొండ కింద పార్కింగ్ స్థలంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ను అధికారులతో కలిసి ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య పరిశీలించారు. అక్కడి నుంచి కొండమీదికి చేరుకోవడం, ఆలయంలో దర్శనం చేసుకోవడానికి రెడ్ కార్పెట్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత వైటిడిఏ అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశం ఏర్పాట్లను పర్యవేక్షించి తగిన సూచనలను ఇచ్చారు. సీఎం రాక సందర్భంగా పోలీసులు యాదగిరిగుట్టలో మూడంచల భద్రతను నిర్వహిస్తున్నారు. అడుగడుగున తనిఖీలు నిర్వహించారు. సీఎం రాక సందర్భంగా భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానాలయంతో పాటు ఆలయ పరిసరాలు పరిశీలించారు. కొండక్రింద హెలిప్యాడ్‌ని, ప్రెసిడెంట్ సూట్‌ను పరిశీలించారు. సీఎం పర్యటనకు ఏలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు. అలాగే సీఎం సెక్యూరిటీ సిబ్బంది సైతం సీఎం పర్యటించే ప్రాంతాలు పరిశీలించారు. అయితే రేపు ఉదయం 8.45కి కుటుంబ సమేతంగా నరసింహుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు సిఎం రేవంత్... దర్శననతరం ఉదయం 10 గంటలకు వైటీడీఏ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటలకు యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా రేపు కుటుంబ సమేతంగా హెలికాప్టర్ లో ఉదయం 8:45 గంటలకు శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు.

మూసీ పునర్జీవం పై పాదయాత్ర ... మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలని ప్రజా ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతిపక్ష పార్టీలు దీనిని అడ్డుకునేందుకు వచ్చేస్తున్న కుయుక్తులను ప్రజలకు వివరించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన జన్మదినోత్సవం రోజున భువనగిరి నియోజకవర్గం వలిగొండ మండలం సంగెం గ్రామంను వేదికగా చేసుకున్నారు. కుటుంబ సమేతంగా యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనం పూర్తి చేసుకుని ప్రత్యేక కాన్వాయ్‌లో సంగెం గ్రామానికి మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకుంటారు. సంగెం గ్రామం నుంచి భీమ లింగం కాలువ వరకు మూసి తీరం వెంబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సహచర మంత్రులు, శాసనసభ్యులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అభిమానులతో కలిసి పాదయాత్ర చేస్తారు. మూసి పునర్జీవం కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ వేదిక నుంచి ప్రజలకు వివరించనున్నారు. ఇందుకు సంబందించిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ విప్ అయిలయ్య గురువారం రాత్రి అధికారులతో కలిసి పరిశీలించారు.

మూసీ తీరం వెంట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షెడ్యూల్..

మూసీ పరీవాహక ప్రాంత రైతులతో మూసీ నది వెంటపాదయాత్ర ద్వారా భీమలింగం, ధర్మారెడ్డి కాల్వల్ని సందర్శిస్తారు. అనంతరం మూసి పరివాహ ప్రాంతా రైతులతో సమావేశం అవుతారు. మూసీ మురికి కూపంలో కొట్టుమిట్టాడుతున్న రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకుంటారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ బయలుదేరుతారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక సందర్భంగా మూసీ పరీవాహకం ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమీకరణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేసే ప్రాంతంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎత్తు ఒంపులు ఉండకుండా మట్టితో సమానం చేశారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను రహదారుల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
కలెక్టర్, జనగాం గారి ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) లోని నబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)

జిల్లా కలెక్టర్, జనగాం ఫైల్ నెం. జి2 /412/2024, తేది: 07.10.2024
జిల్లా కలెక్టర్, జనగాం గెజిట్ నెం. యల్ఎ/జెఎన్/12/2024, తేది: 24.10.2024
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఫైల

విభేదాల పరిష్కారానికి మార్గం కనుగొందాం

ట్రంప్, జెడి.వాన్స్‌లకు జిన్‌పింగ్ శుభ సందేశం

బీజింగ్ : అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్‌కు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యక్షుడుగా గెలిచిన జె.డి.వాన్స్‌కు కూడా సందేశం పంపారు. ఇరు దేశాలూ విభేదాలను సర్దుబాటు చేసుకునేందుకు సరైన పంథాను కనుగొనేందుకు కృషి చేయాలని కోరారు. ఇందు కోసం పరస్పర సంభాషణలు, నిరంతర సంబంధాలు ఉండాలని తన శుభాకాంక్షల సందేశంలో జిన్‌పింగ్ ప్రతిపాదించారు. చైనా, అమెరికా రెండు దేశాలూ పరస్పరం ప్రయోజనకరమైన సహకారం విస్తరించుకోవాలని తాను కోరుకుంటున్నానని జిన్‌పింగ్ విజ్ఞప్తి చేశారు. సహకారం ద్వారా ప్రయోజనం, ఘర్షణ ద్వారా నష్టం జరుగుతుందని చరిత్ర మనకు గుణపాఠం చెప్పిందని కూ డా ఆయన గుర్తుచేశా రు. రెండు దేశాలూ పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, లాభదాయకమైన సహకారం వంటి సూత్రాలకు కట్టుబడి సంభాషణలు, సంబంధాలు కొనసాగిద్దామని ప్రతిపాదించారు. కాగా చైనాతో సంబంధాలు ట్రంప్‌కు పెద్ద సవాలు. అమెరికాకు దిగుమతయ్యే చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను భాగా పెంచుతానని ట్రంప్ ఇప్పటికే ప్రచారం చేశారు.

ట్రంప్ విజయంతో యూరప్ దేశాల నాయకుల పునఃసమీక్ష

బుడాపెస్ట్ : డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా విజయం సాధించడంతో 50 యూరోపియన్ దేశాల నాయకులలు త్వరలో పునఃసమీక్ష జరపనున్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్ సహా యాభైమంది నాయకులు ఈ పునఃసమీక్షలో పాల్గొంటారు. ట్రంప్ మొదటిసారి నాలుగేళ్ళ పాలనలో ఎదురైన పరిస్థితులు మళ్ళీ రాకుండా వాటిని సరిదిద్దేందుకు ఈ పునఃసమీక్ష జరగనున్నది. దీంతో పాటు ఇప్పుడు కొత్తగా జర్మనీలో సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలిపోవడంతో కొత్త సమస్య వచ్చింది. అంతేకాకుండా ఆర్థిక సమస్యలపై విభేదాల కారణంగా ఈ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం సమస్యగా మారింది. జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ తన ఆర్థికమంత్రిని మంత్రివర్గం నుండి తొలగించారు. దీంతో కొద్ది నెలలలో మళ్ళీ ఎన్నికలు వస్తాయన్న ఊహాగానాలు బయలుదేరాయి. ఈ పరిస్థితివల్ల మితవాదులకు, ఇతర పార్టీలకు మధ్య మరోసారి వివాద ప్రతిష్టంభన ఎదురుకానున్నది. ''అమెరికాతో మా సంబంధాలు చాలా ముఖ్యం, వాటిని మరింత పటిష్టం చేసుకునేందుకు మేం సిద్ధంగా ఉన్నాం'' అని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఛార్లెస్ మైఖేల్ అన్నారు. కాగా యూరోపియన్ యూనియన్‌లో ఉన్న 27 దేశాల కూటమి విడిగా బ్రిటన్, టర్కీ, బాల్కన్ దేశాల తో మరో శిఖరాగ్ర సమావేశం జరపనున్నది.

రెండు యుద్ధాలపై ట్రంప్ వైఖరి ఏంటి? ఉక్రేన్‌కు నాటో సభ్యత్వం లేనట్టేనా?





బర్మింగ్‌హామ్ : అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ తిరుగులేని విజయం సాధించారు. అన్నివర్గాల ప్రజలూ ఆయనకు రెడ్ కార్పెట్ పరిచారు. 2025 జనవరి 20వ తేదీన 47వ అధ్యక్షుడుగా ఆయన బాధ్యతలు చేపడతారు. దేశంలో ఆర్థిక సమస్యలు పరిష్కరిస్తాననీ, యుద్ధాలను నివారిస్తాననీ, ఆమెరికా ప్రయోజనాలే ప్రథమ లక్ష్యంగా వలసలు అడ్డుకుంటామనీ, మిత్రదేశాలపై కూడా టారిఫ్‌లు పెంచుతామని, చైనా దిగుమతులపై ముక్కుపిండి వసూళ్ళు పెంచుతామని ట్రంప్ ఇచ్చిన వాగ్దానాలను ప్రజలు విశ్వసించారని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. మరి తదుపరి ట్రంప్ ఏం చేస్తారనే విషయంపైనే అందరూ దృష్టి సారించారు. ఈ విషయాలపై బర్మింగ్‌హామ్ యూనివర్సిటీకి చెందిన స్టీఫెన్ ఉల్ఫ్ ఒక విశ్లేషణ చేశారు. అమెరికాకాంగ్రెస్ ఉభయసభల్లోనూ ఇప్పుడు రిపబ్లికన్‌పార్టీకి తరుగులేకపోవడంతో అంతర్జాతీయకూటమిలు భయపడుతున్నాయి. ఇజ్రాయెల్‌పై వ్యతిరేకత లేనప్పటికీ, పశ్చిమాసియాను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉన్నందువల్ల ట్రంప్ గెలిచినందుకు అమెరికా శత్రువులు కొందరు సంతోషపడుతున్నారు. ఆ దేశ వైఖరిలో ఇక మార్పు రావాలని అమెరికా నెంబర్–2 శత్రువు ఇరాన్ గాఢంగా కోరుకుంటున్నది. అమెరికా గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి ట్రంప్ గెలుపు ఒక అవకాశంగా ఉపయోగపడుతుందని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బాఘైల్ అన్నారు. ఐతే ఇరాన్ లక్ష్యంగా పశ్చిమాసియాలో ఘర్షణలు రెచ్చగొడితే లాభం ఉండదని ట్రంప్ భావిస్తున్నారు. ఇంతకుముందూ ఇప్పుడూ కూడా నెంబర్ –1 శత్రువు చైనా పైనే ఆయన గురి.

ఉక్రేన్‌కు ట్రంప్ మద్దతు ఇచ్చే అవకాశం లేదు. ఎన్నికల ప్రచారంలోనే ఆయన ఈ విషయం చెప్పారు. గతపాలనలో ట్రంప్ యుద్ధాలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడూ కొంత అదే వైఖరి. ఉక్రేన్–రష్యాలు కనీసం ప్రస్తుతం ఉన్న సరిహద్దులలోనే కాల్పుల విరమణ పాటించాలనే ప్రతిపాదనతో బహుశా ఆయన ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది.

ఆక్రమించుకున్న భూభాగాల గురించి ఉక్రేన్ తరపున ట్రంప్ వాదించే అవకాశాలు కనిపించడంలేదు. కనీసం కాల్పుల విరమణ జరగాలనే ఉద్దేశంతో గట్టిగానే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శుభాకాంక్షలు చెప్పినప్పటికీ రష్యా అధ్యక్షుడు పుతిన్ మాత్రం ట్రంప్‌కు శుభాకాంక్షలు చెప్పలేదు. రష్యాతో స్నేహం చెయ్యాల్సో వద్దో ట్రంప్ ఛాయస్‌కే వదిలేస్తున్నట్లు రష్యా తాజాగా చెబుతున్నది. ఎనిమిదేళ్ళక్రితం జరిగిన ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించడానికి రష్యా సహాయం చేసిందని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఉక్రేన్‌తో యుద్ధ విరమణకు సంబంధించి రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసే డిమాండ్లను ట్రంప్ ఆమోదించే అవకాశం కనిపిస్తున్నది. భవిష్యత్‌లో నాటో కూటమిలో ఉక్రేన్‌కు సభ్యత్వం ఇవ్వకూడదని పుతిన్ డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్‌కు కూడా 'నాటో' కూటమి మీద సదాభిప్రాయం లేదు. ద్వేషం కూడా ఉంది. ఇది అందరికీ బాగా తెలిసిన విషయమే. దీనివల్ల ఉక్రేన్‌కు ఉన్న యూరోపియన్ మిత్రదేశాలపై ఒత్తిడి వస్తుంది. ఉక్రేన్ విషయంలో పుతిన్ చేసే డిమాండ్లకు అనుకూలంగా సంతకాలు పెట్టాలనీ, లేకపోతే నాటో కూటమిని వదిలిపెట్టేస్తాననీ బెదిరించి ట్రంప్ యూరోపియన్ మిత్రదేశాలపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. అందువల్ల పుతిన్ డిమాండ్‌ను ట్రంప్ అంగీకరించే అవకాశాలున్నాయి. మధ్యాసియా విషయానికి వస్తే, ఇజ్రాయెల్‌కు, సౌదీఅరేబియాకు గతంలో ట్రంప్ గట్టి మద్దతుదారుగా ఉండేవారు. ఇప్పటివరకూ ఉన్నట్టు పశ్చిమాసియాలో యుద్ధ విస్తరణకు ఆయన సహకరించే అవకాశం లేదు. కానీ నేతన్యాహూ మాత్రం యుద్ధాన్ని విస్తరించాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు రక్షణ మంత్రి గాలంట్‌ను తొలగించడంద్వారా స్పష్టమైంది. తదుపరి ఇరాన్ ఎలాంటి దాడులు చేసినా తీవ్రస్థాయిలో స్పందించాలని కూడా నేతన్యాహూ భావిస్తున్నారు. ఒకవేళ నేతన్యాహూ భవిష్యత్‌లో యుద్ధాన్ని విస్తరిస్తే, ఉక్రేన్‌తో యుద్ధంలో ఇరాన్‌పై ఎక్కువగా ఆధారపడిన పుతిన్‌తో ట్రంప్ జూదానికి దిగుతారు. నేతన్యాహూను వెనక్కుతగ్గమని సలహా ఇచ్చి పుతిన్–జెలెన్స్కీమధ్య ఒప్పందాలకు తెరతీసే అవకాశాలున్నాయని బర్మింగ్‌హామ్ యూనివర్సిటీకి చెందిన స్టీఫెన్ ఉల్ఫ్ విశ్లేషణలో పేర్కొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేస్తాం

(4వ పేజీ తరువాయి)

పరీక్షలకు సిద్ధమయ్యే వారి కి మెటీరియల్, ప్రత్యేక శిక్షణ వంటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. సివిల్ సర్వీస్‌కు మన రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఎంపికైతే మన రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. సివిల్ సర్వీస్ అయినప్పటికీ పాలనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఎంత ఎక్కువ మంది ఉంటే, ప్రాంతీయ అభిమానంతో సంక్షేమ పథకాలు, బడ్జెట్ రూపకల్పన, తదితర అంశాలలో తెలంగాణకు ఎక్కువ లబ్ధి చేకూరే అవకాశం ఉంటుందని భట్టి తెలిపారు.

చితకబాధిన కానిస్టేబుల్

(4వ పేజీ తరువాయి)

స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి బుధవారం రాత్రి వెళ్ళినట్లు వారి బంధువులు తెలిపారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ సాయిలు ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించడమే కాక కొట్టాడని మనస్థాపనతో తన గ్రామానికి వెళ్లిన కిషన్ ఎస్‌సి కమ్యూనిటీ హాల్ సమీపంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపా రు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు బంధువులు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. యువకుడి చావుకు కారణమైన కానిస్టేబుల్ సాయిలు వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి వారిని శాంతింపజేసి మెదక్ డిఎస్‌పితో మాట్లాడించారు. న్యాయం చేస్తామని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

ఎసిబికి చిక్కిన డిఇఒ రవీందర్

(4వ పేజీ తరువాయి)

ఆ ఉపాధ్యాయురాలు డిఇఒ రవీందర్‌ను కలిసి నిలదీసింది. దీంతో డిఇఒ సమాధానం ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకోవాలని సూచించారు. దీంతో ఆమె కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకొచ్చారు. అయినప్పటికీ విధుల్లోకి చేరేందుకు డిఇఒ రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. అయితే సదరు మహిళా ఉపాధ్యాయురాలు రూ.1,50,000 ఇచ్చి ప్రమోషన్ పొందారు. ప్రమోషన్లు రికార్డు ప్రకారంగా తనకన్నా జూనియర్ అయిన ఉపాధ్యాయురాలిని సీనియారిటి చూపించడంతో దీనిని తన భర్తతో కలిసి రవీందర్‌ను తన కన్నా జూనియర్ అయిన వారిని సీనియార్టీ ఎలా చూపిస్తారని అడిగితే కోర్టు నుంచి అనుమతి తీసుకోవాలని మళ్లీ చెప్పారు.

దీంతో ఆ ఉపాధ్యాయురాలు తిరిగి కోర్టు నుంచి సీనియారిటీ అనుమతి తీసుకుంది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని ఆ ఉపాధ్యాయురాలు డిఇఒను కోరగా లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేది లేక సదరు ఉపాధ్యాయురాలు రూ.50 వేల రూపాయలకు ఒప్పందం చేసుకుంది.

ఆ ఉపాధ్యాయురాలు నిబంధనల ప్రకారం తనకు దక్కాల్సిన రిజర్వేషన్లు పదోన్నతుల సీనియారిటీ లంచం ఇచ్చి పొందాల్సిన అవసరం ఏమొచ్చిందని భావించి సదరు ఉపాధ్యాయురాలు ఎసిబి అధికారులను సంప్రదించింది. దీంతో ఎసిబి సిబ్బందికి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిపోయారు. దీంతో నివురగప్పిన నిప్పులా డిఇఒ రవీందర్‌పై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవినీతి అరోపణలు మిన్నంటాయి. ఉన్నతాధికారులు అతనిపై వచ్చిన ఆరోపణలు పట్టించుకోక పోవడంతో విద్యావంతులు విద్యార్థి సంఘాల నాయకులు పలుమార్లు జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయింది. ఎసిబి అధికారులు డిఇఒ రవీందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఏఎసిబి డిఎస్‌పి కృష్ణగౌడ్ తెలిపారు.

పేదల స్థితిగతులు మారుస్తాం

(4వ పేజీ తరువాయి)

పేదప్రజల జీవన పరిస్థితుల ను మార్చేందుకు తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపట్టనున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది కష్టమైనప్పటికీ, ఇబ్బంది అయినప్పటికీ ఖచ్చితంగా మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని అన్నారు. మూసీ పరీవాహక రైతులు, ప్రజలు, కులవృత్తుల బాధలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారికి మేలు చేసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి తన జన్మదినం రోజు మూసీ పాదయాత్ర చేపట్టనున్నారని, ఈ కార్యక్రమానికి అందరూ సహకరించి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు మూసినది లక్షలాది మందికి సాగు, తాగునీరు ఇచ్చిందని, అలాంటిది ఈరోజు మూసీ వెంట నడవలేని పరిస్థితి ఉందని, దుర్గంధంతో ఉన్న మూసీ నదిని శుద్ధీకరణ తర్వాత సాగునీటిని, తాగునీటిని అందించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

మేనిఫెస్టోలో ఈ విషయాలు తాము పొందుపరచనప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి తన పుట్టినరోజున మూసీ నది వెంట పాదయాత్ర చేసి మూసీని శుద్ధీకరణ చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. దీని ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు, రంగారెడ్డి, హైదరాబాదు జిల్లాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, అందుకే మూసీ నది శాశ్వత పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరు మీద 50వేల కోట్ల రూపాయలు, కాళేశ్వరం పేరు మీద లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసి ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని, కానీ మురికి కూపంగా మారిన మూసీ నది మాత్రం గుర్తుకురాలేదని అన్నారు. ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంఎల్‌ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్డీఎ నాగిరెడ్డి, డిపిఒ సునంద, రోడ్లు భవనాల శాఖ నల్గొండ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

శాసనసభ్యులు కెఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి సుమారు రూ. 52.34 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అమృత్ 2.0 పథకం కింద రూ.34.08 కోట్ల వ్యయంతో వర్ధన్నపేట మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ పనులను ప్రారంభించారు.

వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా ధనాన్ని విదేశాలలో ఉంటున్న తమ బంధువులకు, అనుచరులకు బదిలీ చేసి, మెక్కిన వారికి ప్రజా క్షేత్రంలో శిక్ష పడక తప్పదని, పొంగులేటి దీపావళి బాంబులు తుస్సు బాంబులు అయ్యాయని అంటున్న వారు త్వరలోనే తుస్సు బాంబులు, లక్ష్మి బాంబులు కాదు.. ఏకంగా ఆటం బాంబులే పేలుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మార్పు కావాలని అది ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని కనీ వినీ ఎరుగని రీతిలో రాష్ట్ర ప్రజలు తీర్పు ఇచ్చారని, గత పదేళ్లలో జరగని అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 11 నెలల్లో చేసి చూపించామన్నారు. రైతు బంధును కూడా ప్రభుత్వం త్వరలోనే అర్హులకు అందజేస్తుందని మంత్రి తెలిపారు. గడిచిన 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో లక్ష 52 వేల ఇల్లు మంజూరు కాగా 87 మాత్రమే నిర్మించారని, మిగిలిన 65 వేల ఇల్లు మొండి గోడలతో అసంపూర్తిగా నిర్మాణం చేశారని, వాటిని ఇందిరమ్మ ప్రభుత్వం తర్వాత నిర్మించి అర్హులకు అందజేయడం జరిగిందన్నారు. 20లక్షల గృహాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని అందులో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున నిర్మించి నిష్పక్షపాతంగా పారదర్శకంగా గ్రామసభల ద్వారా అర్హులకు అందజేస్తామన్నారు. త్వరలో ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు అందజేస్తామని, ప్రభుత్వ ప్రతి సంక్షేమ ఫలా లు ఆ కార్డు ఆధారంగానే అందజేస్తామని తెలిపారు. స్థానిక వర్ధన్నపేట శాసనసభ్యులు కోరిన విధంగా చెరువు బండ్, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు 200 మంది ఔట్ పేషెంట్ వస్తారని కోరిన మేరకు హాస్పిటల్ అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు ప్రమాణస్వీకారం చేయించి, మంత్రి, ఎమ్మెల్యేలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, నీటిపారుదల, వైద్య ఆరోగ్య సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటమ్ బాంబు పేలబోతోంది...

(4వ పేజీ తరువాయి)

చెల్లించమని నేనే చెప్పా

(4వ పేజీ తరువాయి)

సంబంధమూ లేదని, ఇంతకు సిఎం రేవంత్ రెడ్డికి ఎసిపి అంటే ఫుల్ ఫామ్ తెలుసా? అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. అవినీతి జరిగితేనే ఎసిబిని వాడాలని, ఈ రేస్‌లో అవినీతి ఏమున్నదని, ఇందులో తనకు వచ్చింది ఏముందని ప్రశ్నించారు. తాము హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు ప్రయత్నిస్తుంటే, సిఎం రేవంత్ రెడ్డి మాత్రం బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.విశ్వనగరాల సరసన హైదరాబాద్‌ను నిలపాలనే ఉద్దేశంతోనే తాము ఈ రేస్‌ను తీసుకొస్తే, దీనిని కూడా సిఎం రద్దు చేశారని, మరోవైపు ఫార్మాసిటీని కూడా రద్దు అని ప్రకటించారని,ఇలా రద్దు చేసుకుంటూ పోతే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఒలింపిక్స్ నిర్వహిస్తామని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డికి ఇంతకు ఒలింపిక్స్ నిర్వహణకు ఎంత ఖర్చు అవుతుందో తెలుసా అని ఎద్దేవా చేశారు. ఈ రేస్‌లో రూ.50 కోట్లకే ఇలా వ్యవహరిస్తున్నారని, ఇక ఒలంపిక్స్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చినందుకు తనపైన కేసు పెడతారా? అని ప్రశ్నించారు. రాజ్‌భవన్‌లో కాంగ్రెస్,బిజెపి ఒక్కటవుతున్నాయని, ఆ రెండు పార్టీలు కలిసి బిఆర్ఎస్‌ను ఖతం చేసేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. తనను విచారించేందుకు అనుమతివ్వడం గవర్నర్ విచక్షణపై ఆధారపడి ఉంటుందన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడితే ఎదుర్కొంటానన్నారు. ఎఫ్1 రేసును హైదరాబాద్ లో నిర్వహించేందుకు 2003లోనే అప్పటి ఉమ్మడి రాష్ట్ర సిఎం చంద్రబాబు ప్రయత్నించారని, ఆయన కలను తాము నేరవేర్చామన్నారు. మొదటి ''ఫార్ములా1 ఈ రేస్'కు రూ. 150 కోట్ల ను ఖర్చుపెట్టామని, తద్వారా రాష్ట్రంలో రూ.700 కోట్ల లాభంజరిగిందని వివరించారు.

అవినీతి కేసులో మెఘా కృష్ణారెడ్డిపై కేసు పెట్టే దమ్ముందా?

అవినీతి కేసు నమోదు చేయాల్సి వస్తే సుంకిశాల ఘటనలో మెగా కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేయాలని, దీనిపై ఇప్పటికే అధికారులు నివేదికను సమర్పించారని కెటిఆర్ అన్నారు. ప్రభుత్వానికి నష్టం చేసిన మేఘా కృష్ణారెడ్డి సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టే దమ్ము సిఎం రేవంత్ రెడ్డికి ఉన్నదా? అని ప్రశ్నించారు. మెఘా కృష్ణా రెడ్డి ఇంటికి ఎసిపిని పంపింస్తారా అని అన్నారు.

అప్పుడే... వణిస్తున్న చలి

(4వ పేజీ తరువాయి)

డిగ్రీలు నమోదు కాగా, ఆదిలాబాద్ జిల్లాలో 17.2 డిగ్రీలు, హకీంపేట్, దుండిగల్ ప్రాంతాల్లో 18.0 డిగ్రీలు నమోదైంది. దీంతో ఈ జిల్లాల్లో పెరిగిన చలి తీవ్రతతో తెల్లవారు జామునే లేచే గ్రామీణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు సైతం పెరిగిన చలి తీవ్రత కారణంగా ఉదయం లేచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు జంకుతున్నారు. అదేవిధంగా రాత్రి వేళల్లో డ్యూటీలు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే ప్రైవేట్ ఉద్యోగులు సైతం పెరిగిన చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా అక్కడక్కడ పొగ మంచు సైతం ఏర్పడుతుండడంతో తెల్లవారు జామున రోడ్లపై వాహనదారులకు కష్టాలు తప్పడంలేదు. నవంబర్ మొదటి వారంలోనే చలి విజృంభిస్తుండడంతో రానున్న రోజుల్లో ఏలా ఉండబోతుందోనని ప్రజలు వణికిపోతున్నారు.

మధ్యలో రూల్స్ మార్చేందుకు వీల్లేదు

(4వ పేజీ తరువాయి)

రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభంలో నోటిఫై చేయబడిన 'సెలెక్షన్ లిస్ట్'లో స్థానం పొందేందుకు గల అర్హతలు ఇవి' అని బెంచ్ తెలియజేసింది. నియామక ప్రక్రియ మొదలు కావడానికి ముందే ఒకసారి నియామక నిబంధనలను ఏర్పాటు చేసుకుంటే వాటిని మార్చడానికి వీలులేదని తెలియజేసింది.

నియామక ప్రక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి ఎట్టిపరిస్థితులలోనూ వీల్లేదని, నియామక ప్రక్రియ నిబంధనలు కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండితీరాలని భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి డివై. చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ పి.నరసింహా, జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన కానిస్ట్యూషన్ బెంచ్ చెప్పింది.'నిబంధనలకు లోబడి నియామక సంస్థలు నియామక ప్రక్రియను దాని తార్కిక ముగింపునకు తీసుకురావడానికి తగిన విధానాన్ని రూపొందించవచ్చు. అలా అవలంభించిన విధానం పారదర్శకంగా, వివక్ష తలేనిదిగా, ఏకపక్షంగా మరియు సాధించాలనుకున్న విషయవస్తువుకు హేతుబద్ధమైన సంబంధాన్ని కలిగిఉంటుంది' అని తీర్పును వెలువరిస్తూ జస్టిస్ మిశ్రా అన్నారు. మార్చి 2013లో ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం సూచించిన ప్రభు త్వ ఉద్యోగాల నియామక ప్రమాణాలకు సంబంధించిన ప్రశ్నకు అత్యున్నత న్యాయస్థానం సమాధానం ఇచ్చింది. 1965 తీర్పును ప్రస్తావిస్తూ త్రిసభ్య ధర్మాసనం అర్హత ప్రమాణాల సూచనకు సంబంధించినంతవరకు 'ఆట నియమాలతో' ఆలోచించే వారికి రాష్ట్రాన్ని లేదా దాని సాధనాలను అనుమతించకూడదనేది శుభ సూచక సూత్రమని పేర్కొంది.

కుప్పకూలిన జర్మనీ సంకీర్ణ ప్రభుత్వం

(4వ పేజీ తరువాయి)

పెరుగుతున్న అప్పులపై విధించుకున్న పరిమితులలో మార్పులు చేర్పులు చేయడానికిగానీ ఫ్రీ డెమోక్రాట్స్ ఇష్టపడలేదని, సంక్షేమపథకాల్లో కోతలను తాము వ్యతిరేకించామని షుల్జ్ చెప్పారు. ఐతే షుల్జ్ ప్రకటనపై లిండర్ తీవ్రంగా స్పందించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ప్రధానంగా ముందుకు తీసుకురావడాన్ని ఆయన వ్యతిరేకించారని చెప్పారు. షుల్జ్ ప్రకటనను తీవ్రంగా ఖండించారు. దేశం ఒక కొత్త ఆర్థిక పంథాను అనుసరించాల్సిన అవసరం ఉందనీ, ఇందుకు షుల్జ్ ఇష్టపడలేదని అన్నారు. ఆర్థిక వ్యవస్థకు తిరిగి జవసత్వాలు కల్పించేందుకు షుల్జ్ చేసిన ప్రతిపాదనలను చాలా బలహీనంగా, ఆచరణ విరుద్ధంగా ఉన్నాయన్నారు. దీనిపై షుల్జ్ కూడా తీవ్రంగా స్పందించారు. లిండర్ తన విశ్వాసాన్ని దెబ్బతీశారని, అనేక రోజులు బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో ఆయన అంగీకరించిన ఒప్పందాన్ని ఏకపక్షంగా ఆయనే రద్దుచేశారని షుల్జ్ విమర్శించారు.

మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర

(4వ పేజీ తరువాయి)

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు బేగంపేట్ నుంచి హెలికాప్టర్‌లో సిఎం యాదగిరిగుట్టకు వెళతారు. దర్శనం అనంతరం ఉదయం 11.30 గంటలకు యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ,

బిజెపి మతోన్మాద, మనువాద విధానాలను ఎండగట్టేందుకు..

వామపక్ష పార్టీలు ఏకం కావాలి

వామపక్షాల నాయకులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి మతోన్మాద, మనువాద విధానాలను ఎండగట్టేందుకు వామపక్ష పార్టీలన్నీ ఏకమై దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. రష్యాన్ అక్టోబర్ విప్లవ విశిష్టతను గుర్తు చేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సిసిసి), ఎంసిపిఐ(యు) సంయుక్త ఆధ్వర్యంలో ''ప్రస్తుత రాజకీయ పరిస్థితులు – మతోన్మాద ఫాసిస్టు కార్పొరేట్ శక్తుల ప్రమాదం – వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం'' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఎంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వామపక్ష నాయకులు ఎన్.బాలమల్లేష్ (సిపిఐ), ఆర్ఎంపిఐ జాతీయ నేతలు కె.గంగాధరన్, మంగత్ రాం పాస్లా (ఆర్ఎంపిఐ), మద్దికాయల అశోక్ ఓంకార్, కిరణ్ జిత్ సింగ్ సెఖోన్ (ఎంసిపిఐ(యు), సాధినేని వెంకటేశ్వర్‌రావు (సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ), పిజె జేమ్స్ సిపిఐ (ఎంఎల్ రెడ్‌స్టార్), ఎం.ఎస్. జయకుమార్, ఎన్.ఎస్.మూర్తి (సిపిఐ ఎంఎల్ లిబరేషన్), కె.జి.రాంచందర్(మాస్‌లైన్), గుర్రం విజయ్‌కుమార్ (సిపిఐఎంఎల్), ఎ.జానకిరాములు (ఆర్ఎస్పి), విమలక్క (అరుణోదయ సాంస్కృతిక సంస్థ)లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ మాట్లాడుతూ దేశంలోని అన్ని స్వతంత్ర ప్రభుత్వ వ్యవస్థలను నీరుకార్చుతూ నియంతృత్వ ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు ఏకమై చరమగీతం పాడాలన్నారు. మద్దికాయల అశోక్ ఓంకార్, మంగత్ రాం పాస్లా, సాధినేని వెంకటేశ్వరావు తదితరులు మాట్లాడుతూ 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' పేరుతో బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. నియంతగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వామపక్షాలు ఏకం కావాల్సిందేనన్నారు.

గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు

తెలంగాణ సమాజానికి కీడు కలిగించాయి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్ : గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు తెలంగాణ సమాజానికి కీడు కలిగించాయని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రస్తుతం అందరి అభిప్రాయం మేరకు తెలంగాణకు ఏది అవసరమో అదే నిర్ణయం జరుగుతుందన్నారు. పెట్టుబడులు పెట్టడానికి మంచి ఇండస్ట్రియల్ పాలసీ ఉందని, ప్రవాసీయులు ముందుకు రావాలని కోరారు. ఆస్ట్రేలియా తెలంగాణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో సిడ్నీలోని ఉడ్ క్రాఫ్ట్ కమ్యూనిటీ సెంటర్‌లో గురువారం జరిగిన 'మీట్ అండ్ గ్రీట్' దీపావళి సంబురాలలో తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాజశేఖర్ రెడ్డి మన్యం, నవనీత్ రెడ్డి. కె.దేవిప్రసాద్ మేక, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్. ఎ.డేవిడ్ రాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో అతిథులను ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి స్పీకర్ వివరించారు. సభికుల అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారని తెలిపారు. అందరం రేవంత్‌రెడ్డికి అండగా నిలబడాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు. ఫోర్త్ సిటీని అభివృద్ధి ఏర్పాటు చేస్తున్నారని, యువత కోసం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారని, అన్ని వర్గాల పేద పిల్లలు ఒకేచోట చదువుకునే విధంగా ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నెలకొల్పుతున్నారని వివరించారు. మూసీ పునరుజ్జీవనం, హైడ్రా ద్వారా చెరువుల పరిరక్షణ కోసం యుద్ధమే చేస్తున్నారని చెప్పారు. ఇదంతా తెలంగాణ బంగారు భవిష్యత్తు కోసమే అన్నారు. ఆస్ట్రేలియా రాజకీయాలలో కీలకంగా ఎదగాలని కోరారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయులు కీలకమైన పాత్ర పోషించారన్నారు. ఆరుగురు సెనేటర్లుగా ఎన్నికయ్యారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి చెందడంలో భాగస్వామ్యులు అవ్వాలని కోరారు.

జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ జలమండలి కాంగార్ యూనియన్ (ఐఎన్‌టియుసి) నాయకులకు హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జలమండలి కాంగార్ యూనియన్ (ఐఎన్‌టియుసి) అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో యూనియన్ ప్రతినిధుల బృందం గురువారం టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జలమండలి ఉద్యోగుల ప్రభుత్వ హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న 3000 పోస్టుల భర్తీ, ఉద్యోగులు పదోన్నతులు కల్పించడంతో పాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాని యూనియన్ నేతలు మహేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో మహేష్ కుమార్ స్పందిస్తూ జలమండలి కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరతగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ భూమయ్య, కార్యదర్శి సురేష్ బాబు, ట్రెజరర్ సురేష్, నేతలు ఆర్.సీతయ్య, బిల్డర్ శ్రీనివాస్, జంగారెడ్డి, గణేష్ ,రఘు, నరేంద్ర, కుమార్, అర్జున్, శ్రీనివాస్, బాలరాజ్, బషయ్య, వెంకట్ సుబ్బయ్యా, జగన్మోహన్, ప్రసాద్, సుగుణాకర్ రెడ్డి, సంజీవ, మహమ్మద్ గౌస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

23న మహిళా రిజర్వేషన్లపై మహిళా సదస్సు

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

ప్రజాపక్షం/తాండూరు : మహిళా రిజర్వేషన్ చట్టం 2023ను సవరించి చట్ట సభలలో మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మహిళా సమాఖ్య నాయకురాలు పశ్యపద్మ డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా సమాఖ్య వికారాబాద్ జిల్లా మహాసభను నసీమా బేగం అధ్యక్షతన గురువారం తాండూరులో నిర్వహించారు. ఈ మహాసభకు మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పశ్యపద్మ, విజయలక్ష్మి పండిత్‌ల హాజరైనారు. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ చట్ట సభలో మహిళా రిజర్వేషన్ చట్టం 2023ను సవరించిన షరతులను తొలగించిన మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఈనెల 23న హైదరాబాద్‌లో మహిళా రిజర్వేషన్లపై జరుగుతున్న మహిళా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతం మహిళా ఉద్యమానికి పుట్టినిల్లు లాంటిదని, ఎన్నో హక్కులను ఈ ప్రాంత మహిళలు పోరాటాల ద్వారా సాధించారని అభినందించారు.

ఈ ప్రాంత మహిళలకు మహిళా సమాఖ్య అండగా ఉంటుందన్నారు. మహిళలు మరింత చైతన్యంతో సంఘటితంగా పనిచేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళా సదస్సుకు జిల్లా నుండి పెద్దఎత్తున మహిళలు తరలి రావాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ మహిళలను చైతన్యపరుస్తుంటే నేడు మహిళలను రాజకీయ పరిస్థితులు వారికి చౌక కూలీలుగా మార్చడం శోచనీయమన్నారు. మహిళలు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అవకాశాలను ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కనీస సౌకర్యాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని, ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక...

జిల్లా మహాసభలో వికారాబాద్ జిల్లా మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా నసీమా బేగం కార్యదర్శిగా జగదాంబ, ఉపాధ్యక్షురాలుగా సావిత్రి, చంద్రమ్మ, పున్నెమ్మ, సహాయ కార్యదర్శులుగా పుష్ప, సంతోష, పద్మ, కార్యవర్గ సభ్యులుగా రాములమ్మ, పోచమ్మ, బండపల్లి లక్ష్మి, రాములమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మానవ అక్రమ రవాణా కేసులో..

ఆరుగురికి జీవిత ఖైదు విధించిన ఎన్ఐఎ కోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : మానవ అక్రమ రవాణా కేసులో ఆరుగురికి జీవిత ఖైదు విధిస్తూ గురువారం నాంపల్లిలోని ఎన్ఐఎ కోర్టు తీర్పు వెలువరించింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మానవ అక్రమ రవాణా ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు 2019 ఆగస్టులో ఉప్పుగూడలోని కందికల్ గేట్ ప్రాంతంలోని ఓ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో వ్యభిచార కూపంలో బాధితులుగా ఉన్న ఐదుగురు బాలికలను రక్షించారు. ఛత్రినాక పోలీస్ స్టేషన్లో ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) 2019 సెప్టెంబర్ 17న మళ్లీ కేసును నమోదు చేసి విచారణ చేపట్టింది. మొహమ్మద్ యూసుఫ్ ఖాన్, అతని భార్య బితీ బేగం, సోజిబ్, రాహుల్ అమీన్ ధాలీ, మహమ్మద్ అబ్దుల్ సలామ్ కౌన్లా జస్టిన్, షీలా జస్టిన్ షియులీ ఖాతున్‌లు నిందితులుగా తేలారు. ఈ ముఠా బంగ్లాదేశ్‌లోని యువతులకు గాలం వేసింది. లాభదాయకమైన ఉద్యోగాలు, మంచి జీతం ఇస్తామని బంగ్లాదేశ్‌కు చెందిన బాలికలను మోసగించి, బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు అక్రమంగా రవాణా చేసి, ఇక్కడ వారిని వ్యభిచారంలోకి దింపినట్లు ఎన్ఐఎ దర్యాప్తులో వెల్లడైంది.ఎన్ఐఎ 2020 మార్చి 10న నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసింది. ఐపిసి, ప్రివెన్షన్ ఆఫ్ అనైతిక అక్రమ రవాణా చట్టం, 1986లోని వివిధ సెక్షన్ల కింద దోషులుగా నిర్ధారించబడ్డారు. ఈ మేరకు ఎన్ఐఎ కోర్టు ఆరుగురు నిందితులు దోషులుగా తేల్చింది. ఈ ఆరుగురికి జీవిత ఖైదీతో పాటు 24 వేల రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడు అదనంగా 18 నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని ఎన్ఐఎ కోర్టు తీర్పు వెలువరించింది.

21, 22న అరసం, ప్రజానాట్యమండలి కార్యక్రమాలు

ప్రజాపక్షం /హైదరాబాద్ : ఈనెల 21,22న అరసం,ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో 'సిపిఐ శతజయంతి' కార్యక్రమాలను నిర్వహించాలని అరసం, ప్రజానాట్యమండలి సంయుక్త సమావేశం నిర్ణయించింది. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో అరసం, ప్రజానాట్యమండలి సంయుక్త సమావేశం గురువారం జరిగింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరాస్వామి, ప్రధానకార్యదర్శి రాపోలు సుదర్శన్, కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎల్, హైదరాబాద్ కమిటీ కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్, ప్రజానాట్యమండలి ప్రధానకార్యదర్శి పల్లెనర్సింహ, ఉపాధ్యక్షులు రేగుంట చంద్ర శేఖర్, నాయకులు నర్సయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబసర్వే పూర్తికి కృషి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

వ్యాపార వ్యతిరేకిని కాదు

గుత్తాధిపత్యానికి వ్యతిరేకిని : రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : బిజెపి తనను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరించాలని భావిస్తోందని, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. కానీ తాను 'వ్యాపార వ్యతిరేకి' కాదన్నారు. అయితే 'గుత్తాధిపత్య వ్యతిరేకి', కొద్ది మద్దే ఆధిపత్యం చెలాయించడానికి వ్యతిరేకినని స్పష్టం చేశారు. అసలు ఈస్టిండియా కంపెనీ 150 సంవత్సరాల క్రితం పతనమైందని, అయితే అది సృష్టించిన పచ్చి భయం కొత్త జాతి గుత్తాధిపత్యంతో తిరిగి వచ్చిందని ఓ వార్తా సంస్థతో రాహుల్‌గాంధీ రెండు రోజుల క్రితం తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కాగా, ప్రగతిశీల భారతీయ వ్యాపారం కోసం ఒక కొత్త ఒప్పందం కుదుర్చుకోవాల్సిన సమయం ఎవరి కోసం ఆసన్నమైనదని ప్రశ్నించారు. ఈ మేరకు ఒక వీడియోను గురువారం నాడు రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను పూర్తిగా ఒక విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నానని, బిజెపి చిత్రీకరించాలని చూస్తున్నట్లుగా తాను వ్యాపార వ్యతిరేకని అసలే కాదన్నారు. అయితే గత్తాధిపత్యానికి వ్యతిరేకినని, మార్కెట్ నియంత్రణ శక్తులకు వ్యతిరేకినని స్పష్టం చేశారు. ఇద్దరు లేదా ఐదుగురు మాత్రమే ఆధిపత్యం చెలాయించడానికి వ్యతిరేకినన్నారు. మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా తన కేరీర్ ప్రారంభించానని, వ్యాపారం విజయవంతం కావడానికి అవసరమైన విషయాలను అర్థం చేసుకున్నానన్నారు. దేశంలో కొందరు వ్యాపారవేత్తలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారని ఇటీవల ఓ ఆంగ్ల వార్తా పత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ పేర్కొన్నారు. మార్కెట్‌ను నియంత్రిస్తున్న అటువంటి శక్తుల వల్ల అనేక వ్యాపారాలు క్షీణించాయని, ఉద్యోగాల సృష్టి కూడా కష్టమయ్యిందని అభిప్రాయపడ్డారు. అనేకమంది యువ వ్యాపారవేత్తలు ఇటువంటి గుత్తాధిపత్యాన్ని చూసి భయపడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. దీనిపై బిజెపి నుంచి విమర్శలు వ్యక్తం కావడంతో రాహుల్ దీనిపై క్లారిటీ ఇచ్చారు.

రాజీ కుదిరిందని కొట్టేయలేం

లైంగిక వేధింపుల కేసులో 'సుప్రీం' కీలక తీర్పు

న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల కేసులో సుప్రీం ధర్మాసనం కీలకతీర్పునిచ్చింది. ఫిర్యాదుదారుల కుటుంబంతో నిందితుడు రాజీ పడినంత మాత్రాన కేసును కొట్టివేయడం కుదరదని తేల్చిచెప్పింది. ఈ కేసులో దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును కూడా సుప్రీం కొట్టివేసింది. ఫిర్యాదుదారు, నిందితులు కలిసి 'రాజీ' కుదుర్చుకున్నంత మాత్రాన లైంగిక వేధింపుల కేసును రద్దు చేయలేమని సుప్రీంకోర్టు ఈరోజు తీర్పునిచ్చింది. ఇదే కేసులో నిందితుడికి ఉపశమనం కలిగిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపైనా అత్యున్నత ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 2022 లో జస్థాన్ లోని గంగాపూర్ నగరంలో ఈ కేసు నమోదైంది. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై మైనర్ దళిత బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దా ని ప్రకారం కేసు నమోదైంది. తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టుగా మైనర్ విద్యార్థిని ఇ చ్చిన ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పలు సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో పోక్సో చట్టంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి (అట్రాసిటీల నిరోధక) చట్టాన్ని కూడా ఉపయోగించారు. మైనర్ వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. ఇటీవల నిందితుడు విమల్ కుమార్ గుప్తా స్టాంప్ పేపర్‌పై బాలిక కుటుంబం నుంచి ఓ వాంగ్మూలాన్ని తెచ్చాడు. అందులో తాము నిందితుడిని అపార్థం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశామని.. ఇకపై ఉపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదని బాధిత కుటుంబం పేర్కొన్నట్టుగా ఉంది. పోలీసులు దీనిని అంగీకరించి కోర్టుకు నివేదిక సమర్పించారు. అయితే కింది కోర్టు ఈ చర్యను తోసిపుచ్చింది. దీంతో నిందితులు హైకోర్టును ఆశ్రయించగా, దానిని అంగీకరించిన హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆదేశించింది. ఈ హైకోర్టు తీర్పును రామ్‌జీ లాల్ బైర్వా అనే సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో సవాలు చేశారు. జస్టిస్ సిటి రవికుమార్, జస్టిస్ పివి సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. రాజీ కుదుర్చుకున్నంత మాత్రాన కేసును రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

షారుక్ ఖాన్‌కు బెదిరింపులు

ముంబయి : బాలీవుడ్‌కు చెందిన మరో అగ్రనటుడు షారుక్‌ఖాన్‌కు బెదిరింపులు వచ్చాయి. రూ.50లక్షలు ఇవ్వకపోతే హాని తలపెడతామంటూ ముంబ యి పోలీసులకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ కేసులో ఒక కీలక విషయం వెలుగులోకి వచ్చి ంది. ఆ ఫోన్ కాల్‌ను ఆరా తీయగా.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌కు చెందిన ఫైజన్ ఖాన్ అనే వ్యక్తి పేరు మీద నంబరు రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పో లీసులకు సమాచారమివ్వగావారు ఫైజన్ ఖాన్‌ను ప్రశ్నించారు. తన ఫోన్ నవంబరు 2వ తేదీనే చోరీకి గురైందని, దానిపై తాను ఫిర్యాదు కూడా చేశానని పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఆ ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. షారుక్‌కు గతేడాది అక్టోబరులోనూ ఇదే విధంగా హత్య బెదిరింపులు వచ్చాయి. ఇదిలా ఉంటే.. గత కొద్దిరోజులుగా నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా షారుక్ ఖాన్‌కు డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది.

పంటవ్యర్థాల కాల్చివేతపై జరిమానా రెట్టింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ–ఎన్‌సిఆర్ పరిధిలో గాలిలో వాయు నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంట అవశేషాలను తగులబెట్టే రైతులకు వేసే జరిమానాను రెట్టింపు చేసింది. ఐదు ఎకరాలకంటే ఎక్కువ వ్యవసాయభూమి ఉన్న రైతులకు రూ. 30 వేల మేరకు జరిమానా విధించనుంది. వాయు కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పంటల వ్యర్థాలను తగులబెడుతున్న రైతులకు జరిమానాను రెట్టింపు చేస్తున్నట్లు ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం రెండు ఎకరాల లోపు ఉన్న రైతులు ఇప్పటి వరకు పర్యావరణ పరిహారాన్ని రూ.2500 చెల్లిస్తుండ గా, ఇకమీదట రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా రెండు నుంచి ఐదు ఎకరాల మధ్య ఉన్న రైతులు రూ. 5 వేలకు బదులు గా రూ. 10 వేలు జరిమానా చెల్లించాలి. వాహన ఉద్గారాలు, వరిగడ్డి, బాణసంచా కాల్చడం వల్ల, ఇతర స్థానిక కాలుష్య మూలాలతో కూడిన ప్రతికూల వాతావరణ పరిస్థితులు శరదృతువు చివరి, చలికాలంలో ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లో ప్రమాదకర గాలి నాణ్యత స్థాయిలకు దోహదం చేస్తాయి. ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ (డిపిసిసి) విశ్లేషణ ప్రకారం, పంజాబ్, హర్యానాలలో కొయ్యకాళ్లు తగులబెట్టిన ఘటనల సంఖ్య పెరిగినప్పుడు నగరంలో నవంబర్ 1 నుండి 15 వరకు గరిష్ట కాలుష్యం నమోదవుతుంది. వరి–గోధమ పంటల వ్యవస్థ, దీర్ఘకాలిక వరి రకాలను సాగు చేయడం, పొలంలో నిలిచిన పంట పొలాలను వదిలివేసే యాంత్రిక హార్వెస్టింగ్ చేయకుండా పొలంలో నిటారుగా ఉన్న పంటను కాల్చడం, కూలీల కొరత, పంట అవశేషాలకు ఆచరణీయమైన మార్కెట్ లేకపోవడం వంటివి పంట వ్యవర్థాల కాల్చివేతకు ప్రధాన కారకాలుగా ఉన్నాయి. చలికాలంలో రైతులు పం ట అవశేషాలను ఎపిసోడిక్‌గా కాల్చివేయడం, ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లో గాలి నాణ్యత తక్కువగా ఉండటం ప్రధాన ఆందోళన కాదని సీనియర్ పర్యావరణవేత్త సునీతా నారాయణ్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించిన రైతు సంఘాలు

పంట వ్యర్థాల కాల్చివేతపై జరిమానాను కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేయడాన్ని పంజాబ్‌లోని పలు రైతు సంఘాలు ఖండించాయి. కాల్చివేతకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం యంత్రాలను సమకూర్చాలని డిమాండ్ చేశాయి. రైతులు పంట అవశేషాలను కాల్చివేయాలను ఎవరూ అనుకోరని, అయితే తగినన్ని యంత్రాలు లేకపోవడం వల్లే బలవంతంగా పంటల వ్యర్థాలను కాల్చివేయాల్సి వస్తుందని పేర్కొన్నాయి. కాలుష్యం పెరుగుదలకు రైతులే కారణమని తరుచూ వారినే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించాయి. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డాయి. భారతి కిసాన్ యూనియన్ (ఎక్తా ఉగ్రహాన్) ప్రధాన కార్యదర్శి సుఖదేవ్ సింగ్ కొక్రికలాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేకి అని విమర్శించారు. జరిమానా రెట్టింపు చేసిన కేంద్రం నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యల వల్ల రైతు లపై ఒత్తిడి పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. జరిమా నా నుపది రెట్లు పెంచుకున్నా తాము చెల్లించబోమన్నారు. కిసాన్ మజ్దూర్ మో ర్చా నేత సర్వాన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభ్వుతం జరిమానా పెంచండం తీవ్రంగా ఖండించతగిన విషయమన్నారు. కేవలం 30 శాతం మాత్రమే పంట అవశేషాల నిర్వహణ యంత్రాలు సమకూర్చారని విమర్శించారు.

మహిళల గదుల్లోకి పోలీసులు వెళ్లడం తప్పు

వయనాడ్: సోదాల పేరుతో కాంగ్రెస్ మహిళా నేతలు ఉన్న గదుల్లోకి ప్రవేశించడం తప్పని కేరళలో పోలీసుల తీరుపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో పాల్గొన్న ఆమె పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు. వయనాడ్, పాలక్కాడ్‌లో మరికొన్ని రోజుల్లో ఉప ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ మహిళా నేతలు పాలక్కాడ్‌లోని ఓ హోటల్‌లో ఉన్నారు. ఒక కాంగ్రెస్ కార్యకర్త బ్యాగ్‌తో లోపలికి ప్రవేశించారు. ఇదంతా సిసిటివిలో రికార్డు కావడంతో అనుమానాలకు దారి తీసింది. ఎన్నికల వేళ నల్లధనాన్ని తీసుకువెళుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది. సోదాలు న

పొలాల వద్దే కొనుగోలు చేయాలి

కలెక్టర్ సిక్నాపట్నాయక్‌ను కోరిన రైతులు

ప్రజాపక్షం / ధన్వాద : గతంలో మాదిరిగానే వరి ధాన్యాన్ని పొలాల వద్దనే కొనుగోలు చేయాలని పలువురు రైతులు జిల్లా కలెక్టర్ సిక్నా పట్నాయక్‌కు విన్నవించారు. ధన్వాద సింగిల్ విండో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిర్వాహకులతో మాట్లాడారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చిన తర్వాతనే తేమతో పాటు అన్ని రకాల విషయాలను గుర్తించి గన్ని బ్యాగులను అందజేయాలన్నారు. అక్కడే లారీలను ఎక్కించి మిల్లులకు తరలించాలని సూచించారు. లారీలకు జిపిఎస్ విధానం ఉంటుందని ఈ సందర్భంగా రైతులు గతంలో లారీలను పొలాల దగ్గరికి పంపేవారని కొనుగోలుదారులు అక్కడే తేమ శాతాన్ని గుర్తించి గన్నీ బ్యాగులు ఇచ్చేవారన్నారు. కొనుగోలు కేంద్రం దగ్గర వడ్లు ఆరబెట్టడానికి ఇబ్బందులకు గురవుతున్నామని దీని వల్ల అదనపు ఖర్చులు పడుతున్నాయని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ దేవదాసు, సిఓ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి : మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి గురువారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి , పండుగ సాయన్న ,చౌరస్తా దగ్గర స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, కార్యదర్శి మనోజ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్యస్థాపన కోసం ఉద్యమిద్దాం

ప్రజాపక్షం/మక్తల్ : శ్రమ దోపిడి వ్యతిరేకంగా పోరాడుదామని కార్మిక రాజ్య స్థాపన కోసం ఉద్యమిద్దామని టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం రష్యా విప్లవ యోధుడు క్రామేడ్ విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా టియుసిఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిసదస్సు మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ సదస్సుకు టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, సిపిఐ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము, డివిజన్ కార్యదర్శి ఏ.సలీం, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నర్సింహ్మ, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు బోయిన్నపల్లి రాము, ఏజి భట్టో టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎదురింటి నర్సిములు మాట్లాడుతూ 1917 నంబరు 07న రష్యా దేశంలో కార్మిక వర్గం అధికారంలోకి వచ్చిందని అన్నారు. రష్యా కార్మిక వర్గం జారు చక్రవర్తికి వ్యతిరేకంగా తిండి కావాలని ఎనిమిది గంటల పని దినంగా కావాలని కార్మికులకు హక్కులు కావాలన్నారు.

అపరిచితులతో విద్యార్థులు అప్రమత్తం

ప్రజాపక్షం /ఊట్కూర్ : నారాయణపేట జిల్లాలోని మహిళలు, విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన టి సేవ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చిన షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య తెలిపారు. గురువారం ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దజట్రం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజు స్కూలు, కళాశాలకు వచ్చే విద్యార్థులు, మహిళలు టీ సేఫ్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని ప్రయాణం చేసే సమయంలో తప్పక ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎక్కువగా తెలిసిన వారితోనే వేధింపులకు గురవుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ధైర్యంగా ఉండి షీ టీం పోలీసులకు సెల్ నం. 8712670398కి లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య, భరోసా టీం ప్రమీల, దేవీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి : నారాయణపేట జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహనాలను నడిపిస్తున్న వాహనదారులకు త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారికి, మైనర్లకి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సావర్కర్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు సంతోష్ , నరేష్‌లు మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లకు వాహనాలు ఇవ్వరాదని చిన్న పిల్లలకు బండ్లు ఇవ్వడం వల్ల రాష్ డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. త్రిబుల్ రైడింగ్‌లో వాహనాలను నడపరాదని అలా చేయడం వల్ల వాహనాలు కంట్రోల్ కాక రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందనివాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్లు రోడ్డుపైన తిరిగితే వాహనాలను ఈజ్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సంతోష్ , నరేష్ , ఎచ్‌జి. ఆంజనేయులు, వాహనదారులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిసకావొద్దు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ : జిల్లా యువజన క్రీడాసర్వీస్‌శాఖమై భారత్ సహకారంతో స్వామివివేకానంద సేవాబృందం ఆధ్వర్యంలో పాలెం వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో యువత డ్రగ్స్‌వాడకం వలన కలిగే అనర్థాలు జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా డిఎస్‌పి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యువత సరదాలకోసం డ్రగ్స్ అలవాటు చేసుకుంటే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. డ్రగ్స్‌వాడటం చట్టరీత్యానేరమని డ్రగ్స్ , మద్యపానం అలవాటు వలన అనారోగ్యాలు కుటుంబాలు ఇబ్బందులు పడతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యనారాయణ, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కోటనాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా సీఐ కనకయ్య, బిజినేపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో హౌస్‌లిస్టింగ్ ప్రక్రియ

పరిశీలించిన నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్‌సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేను జిల్లాలో పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఇంటింటి కుటుంబసర్వేకు సంబంధించి ఆయా నివాస ప్రాంతాలలో ఇళ్ల జాబితాల రూపకల్పన ప్రక్రియకి సంబంధించి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి సందర్శన జరిపి ఈ ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. తాడూరు మండలం సిర్సవాడ గ్రామంలో సమగ్ర ఇంటింటి సర్వేలో స్టిక్కర్ అంటించే ప్రక్రియను పరిశీలించారు. కొప్పునూరు పర్వతాలు ఇంటికి సంబంధించిన స్టిక్కర్లను అతికిస్తూ వాటిపై నమోదుచేస్తున్న వివరాలను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నిర్ధేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ హౌస్‌లిస్టింగ్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఎక్కడకూడా దూప్లికేషన్ లేకుండా హౌస్‌లిస్టింగ్ చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇక్కడ ఇళ్లు ఉండి ఇతర జిల్లాలో నివాసముంటున్న వారు స్వచ్ఛందంగా ఎక్కడైన ఒకచోట మాత్రమే వారి వివరాల నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను పరిశీలించి, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మాలను పరిశీలించి ఏవిధంగా నమోదు చేస్తున్నారని , కుటుంబసభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని మీకు ఎన్ని ఇండ్లు కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసర్వేలో తదుపరి వివరాలను సేకరించేటప్పుడు కుటుంబ యజమానులు వారివారి ఆధార్, ఓటర్, అవసరమైన కార్డులను ఎన్యుమరేటర్లకు చూపించేలా తెలపాలన్నారు. ఈసర్వేలో ఇంటి యజమానుల వివరాలను కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌వెంట ఎంపిడిఓ బ్రహ్మచారి, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన్న కలెక్టర్

తాడూరు మండలం సిర్సవాడ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోలు కేంద్రానికి వచ్చిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. గురువారం రైతులనుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల కేంద్రా నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా ? అని ఆరాతీశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లావ్యాప్తంగా 253 ధాన్యం కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఈసారి సన్నరకం, దొడ్డురకం ధాన్యం సేకరణకై వేర్వేరుగా కేంద్రాలను అందుబాటులో ఉంచామని వివరించారు. కొనుగోలు కేంద్రాలద్వారా సేకరించిన ధాన్యాన్ని వెంటవెంట నిర్ధేశిత రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. కలెక్టర్‌వెంట జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు శ్రీనివాస్, రాజేందర్, తహసీల్దార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద పత్తి రైతుల ధర్నా

తేమపేరుతో కొనుగోళ్లను నిరాకరించడంపై మండిపాటు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : పత్తి కొనుగోలుచేసేందుకు తేమశాతం ఎక్కువగా ఉందన్నసాకుతో పత్తికొనుగోళ్లను నిలిపివేయడంతో పత్తిరైతులు ఆగ్రహించి కొనుగోలు కేంద్రంముందు ధర్నాకు దిగారు. ఈఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లి సిసిఐ కొనుగోలు కేంద్రంవద్ద చోటుచేసుకుంది. రైతులు పండించిన పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా అక్కడ అధికారులు నామమాత్రంగా పరీక్షలుజరిపి తేమశాతం ఎక్కువగా ఉందంటూ కుంటిసాకులుచెప్పి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని రైతులు వాపోయారు. దళారులు ఇతరులుతెచ్చిన పత్తిని మాత్రం కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణంలో జరిగేమార్పుల కారణంగా తేమశాతం హెచ్చుతగ్గులు అవుతోందని దానిని సాకుగా చూపి దళారులు అధికారులు కుమ్మక్కై రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. గ్రామాల్లోకి వచ్చే దళారులు మాత్రం తక్కువధరకే పత్తిని కొనుగోలు చేస్తున్నారని వారికి ఇష్టం వచ్చినరీతిలో కాంట నిర్వహిస్తున్నారని తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు ధర్నా చేపట్టడంతో నాగర్‌కర్నూల్ అచ్చంపేట ప్రధాన రహదారి పూర్తిగా ట్రాఫిక్‌జామై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న తెలకపల్లి ఎస్ఐ నరేష్ సంఘటన స్థలానికివెళ్లి రైతులకు సర్దిచెప్పారు. పత్తి కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

లాభాల బాటలో తెలంగాణ వ్యవసాయం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్-నగర్ ప్రతినిధి : లాభాల బాట పట్టింది తెలంగాణ వ్యవసాయం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హన్వాడ మండ లం, వేపూరు గ్రామంలోని రైతు వేదిక దగ్గర ఏ ర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తూ, అందరికి అన్నం పెట్టే రైతు క్షే మంగా ఉండాలని ప్రజా ప్రభుత్వం కోరుకున్న ది. రైతులను రుణ విముక్తులను చేసిందని ఆ యన స్పష్టం చేశారు. సంతోషంగా ఉంటుందని ఆయన అన్నారు. అందుకే రైతు పండించిన పం ట కొనుగోలు చేసి, 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా రైతులకు మేలు చేయాలనే చిత్తశుద్ధి మా ప్రభుత్వానికి ఉంది. కాబట్టి వారికి మద్దతు ధర కల్పించడంతో పాటు సన్నాలకు 500 రూపాయల బోనస్ కూడా అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఎవరి మాటలు వినవద్దని, దళారులను నమ్మి మోసపోరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో మీ ధాన్యం అమ్ముకునే సౌలభ్యం కల్పించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణ, అచ్చన్న, వెంకటాద్రి, నాయకులు యాదవ రెడ్డి, నవనీత, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, రవి, బొట్టు శ్రీను, ఖాజాభాష, నుబ్బారెడ్డి, వెంకటయ్య, అంజిలయ్య, లక్ష్మారెడ్డి, పెంట్యా నాయక్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో అరకొర మట్టి ర్యాంపు

పర్మిషన్ ఇవ్వనీ మండల ఎమ్మార్వో

ప్రజాపక్షం/మానవపాడు : మానోపాడు మండలం చెన్నిపాడు పెద్దపోతుల పాడు గ్రామ శివారులో వర్షాకాలం వచ్చిందంటే చాలు పెద్ద పోతులపాడు శివారులో ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంతుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అలంపూర్ చౌరస్తా టూ కర్నూల్‌కు వెళ్ళాలన్న ఇటు వైపు మండల కేంద్రానికి ప్రయాణం కొనసాగించాలన్న భయం గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తుండేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గత ప్రభుత్వ నాయకులు దృష్టికి తీసుకెళ్లడంతో ఆ ఎనిమిది గ్రామాల ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి మాజీ ఎమ్మెల్యే అబ్రహం బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2.50 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి నిధులతో 2023లో గత ప్రభుత్వం మంజూరు చేయించింది. దీంతో ఆ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పెద్ద పోతులపాడు గ్రామ శివారులో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారభించి పనులు పూర్తి చేశారు. కానీ ఎక్కి దిగే మార్గంలో అర కొరగా గుత్తేదారుడు మట్టి ర్యాంపు వేసి పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో ఆయా గ్రామాల ప్రజలు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, పెద్ద పోతులపాడు చెన్నిపాడు గ్రామస్తులైన తెలంగాణ ఉద్యమకారుడు దుబ్బన్న ,మాదిగ రాములు మాట్లాడుతూ ఈ బ్రిడ్జికి మట్టి తోలడానికి మండల ఎమ్మార్వో కాంట్రాక్టు దారునికి పర్మిషన్ ఇవ్వకుండా ఉండటంతో తుపాలిస్‌గా కాంట్రాక్ట్ దారుడు ఇటు అటు నాలుగు ఫీట్లు తగ్గలు పెట్టి మధ్యలో మట్టి పోసుకుంటు వెళ్ళారు పూర్తిగా మట్టి వెయ్యలేదు అని ఇట్టి సమస్యను ఆర్ అండ్ బి ఏఈ రాజేశ్వరి చెప్పగా ఇప్పుడు మేము ఏమి చెయ్యాలని సమాధానం చెప్పుతున్నారు. ఈ బ్రిడ్జిమీద రాత్రి పూటద్విచక్ర వాహన దారులు జారీ ప్రమాదాలతో పాటు వారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితిలో ఉన్న పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు, మండల ఎమ్మార్వో ఇప్పటికైనా బ్రిడ్జి విశాలత ఎంత ఉందో ఇరువైపులా పూర్తి వెడల్పు తో కూడిన మట్టి రోడ్డు వెయ్యాలని గ్రామస్తులు వాహన దారులు కోరుతున్నారు.

9,10 తేదీలలో ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్

కలెక్టర్ జిల్లా, ఎన్నికల అధికారి విజయేందిర బోయి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ఓటరుగా నమోదుకు ఈ నెల 9,10 తేదీలలో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయేందిర బోయి తెలిపారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఅర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి మరో అవకాశం అని, ఓటరు జాబితాలో తమ పేరు ఉందో ఓటరు చెక్ చేసుకుని, ఓటరుగా పేరు లేకుంటే ఫారం 6 ద్వారా పోలింగ్ బూత్‌లో ఉన్న బిఎల్‌ఓ దగ్గర నమోదు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ బూత్ లలో నవంబరు 9,10 తేదీల్లో బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుండి అందుబాటులో ఉంటారని కలెక్టర్ అన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో ఫారం 6,7,8,8ఎ దరఖాస్తులు బిఎల్‌ఓల దగ్గర అందుబాటులో ఉంటాయని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు రెండు కలర్ పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, నివాస, వయస్సు ధృవీకరణ పత్రం తీసుకుని రావాలని అన్నారు. ఆన్‌లైన్ లో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఓటరు నమోదు సమాచారం కొరకు 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం నవాబ్ పేట మండలం ఇప్పటూర్ కారూర్ గ్రామంలో , రాజాపూర్ మండల కేంద్రంలో ఇండ్ల జాబితా తయారీ ఇంటికి స్టికరింగ్ వేయడం ప్రక్రియను తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియలో ప్రతి ఇంటికి వెళ్ళాలని అన్నారు. ఎన్యుమరేటర్‌లు ఇంటి నెంబర్, ఇంటి యజమాని, తదితర వివరాలను అడిగి తెలుసుకొని ఇంటికి అతికించే స్టిక్కరపై నమోదును పరిశీలించారు. వార్డు కోడ్, బ్లాక్ తదితర కోడ్ నెంబర్లు నమోదు చేసుకొన్న అనంతరం 9 వ తేదీ నుండి మరో సారి ఇండ్లను సందర్శించి పూర్తి వివరాలను సేకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కు సంబంధించి ఎన్యుమరేటర్‌తో ఉన్న స్టిక్కర్, మ్యాప్, ఐడి కార్డ్, ఇతర ఫారం లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సర్వే కు సంబంధించి పాలాలను, వాటిని పూరిచడం, వివరాల సేకరణ తదితర అంశాల పై మరో సారి ఎన్యుమరేటర్లకు స్పష్టం తెలియ చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మండల ప్రత్యేక అధికారి, బి.సి. సంక్షేయ శాఖ అధికారిణి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ టెండర్లలో గోల్ మాల్

ఎల్ 1 కాంట్రాక్టర్ కాదని ఎల్ 3కి పనులు అప్పగించే ప్రయత్నం

ప్రజాపక్షం / పెబ్బేరు : నీటిపారుదల శాఖలో తమకు నచ్చిన వ్యక్తులకు టెండర్లు అప్పగించడంలో పెబ్బేరు ఇరిగేషన్ అధికారులు ఆరితేరారు. వివరాల్లోకి వెళ్లగా పెబ్బేరు ఇరిగేషన్ డివిజన్ 6లో పని చేస్తున్న అధికారులు ఫ్లడ్ డామేజ్ రిస్టోరేషన్ అత్యవసర పనుల కింద జూరాల ప్రధాన ఎడమ కాలువ 3.100 కి మీ దగ్గర డిస్ట్రిబ్యూటర్ 16పై మిరాసిపల్లి గ్రామ సమీపాన పైపు కల్వర్టు పునర్నిర్మాణం కొరకు టెండర్ ఐడి 5447959 లక్షల 99వేల రూపాయలతో నీటి పాదుల శాఖ అధికారులు టెండర్లన పిలిచారు. ఈ టెండర్ కోసం ఏడు మంది కాంట్రాక్టర్లు తమ బిడ్డలను దాఖలు చేయగా ఎల్ 1 గా వెంకటస్వామి నిలిచారు. అయితే కొసమెరుపు ఏంటంటే ఈ పనులను కొందరు గ్రామస్తులు కలిసి అగ్రిమెంట్ కాకమునపే పూర్తి చేయడంలో ఇటు ఇరిగేషన్ అధికారులు అటు కాంట్రాక్టర్లు కుమ్మకై నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేస్తుండటం గుర్తించాల్సిన విషయం. ఈ విషయంపై కొందరు ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అగ్రిమెంట్ చేసుకోక మునుపే పనులు చేయడంతో అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మకైన విషయం ఇక్కడ స్పష్టంగా కనబడుతుంది. ఇరిగేషన్ డివిజన్ 6 అధికారులు తమకు నచ్చిన వ్యక్తులకు ఎల్ 3గా నిలిచిన వ్యక్తికి పనులు అప్పగించాలని ప్రయత్నిస్తున్నట్లు ఎల్ 1 వెంకటస్వామి ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత ఈఈ , జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లను ఫోన్ పై వివరణ కోరగా ఈ టెండర్ ఫ్లడ్ డ్యామేజ్ రిస్టోరేషన్ పని అత్యవసరంగా పూర్తిచేయించాలని నిబంధన ప్రకారమే పనులు కేటాయిస్తామని వారు అన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాపక్షం / మక్తల్ రూరల్ : మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా మాత్స్యకారులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ నియోజకవర్గ పరిధిలోని సంఘం బండ, భూత్పూర్ రిజర్వాయర్లలో సుమారు పది లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో పూర్తిగా నాణ్యమైన చేప పిల్లలను రిజర్వాయర్లు చెరువులలో విడుదల చేయడం జరుగుతుందని సూచించారు. గత ప్రభుత్వ హయంలో చేప పిల్లల పంపిణీ చేసిన వారికి దాదాపు రూ. 97 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తూ చేప పిల్లలు రొయ్యలు తదితర వాటి పెంపకానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు, ఏడి రెహమాన్ , జిల్లా మత్స్య సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్ , మాజీ చీఫ్ ప్రమోటర్ కొళ్ల వెంకటేష్‌లను సంఘం నాయకులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

ప్రజాపక్షం / మక్తల్ : ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం చోటు చేసుకుంది. డెలివరీ కోసం వచ్చిన మహిళ ఆడ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఆస్వస్థకు గురై మరణించింది. ఇది ముమ్మాటికి వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గడ్డంపల్లి గ్రామానికి చెందిన దీపికను (26) కర్ణాటక రాష్ట్రం సబ్జపురంకు చెందిన శివకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు సంతానం కాగా మూడో కాన్పు కోసం మంగళవారం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా బుధవారం ఉదయం 11 గంటలకు నార్మల్ డెలివరీ అయ్యి ఆడ పాపకు జన్మనిచ్చింది. రక్తం తక్కువగా ఉందని డాక్టర్లు రక్తం ఎక్కించారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఆరోగ్యంగా ఉన్న దీపిక పరిస్థితి హఠాత్తుగా విషమనించడంతో విఇవిధ టెస్టులు చేసి నారాయణపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలని బంధువులకు తెలిపారు. హుటాహుటిన దీపికను జిల్లా క

అక్టోబరు విప్లవ స్ఫూర్తి అజేయం, అజరామరం

సోషలిజం భావనను వాస్తవంలోకి తెచ్చిన మహత్తర ఘటన

మార్క్సిజాన్ని అమలు చేసిన మహనీయుడు లెనిన్ : సిపిఐ నేత బాగం

ప్రజాపక్షం/ఖమ్మం: అక్టోబరు విప్లవ స్ఫూర్తి అజేయం, అజరామరమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. అక్టోబరు విప్లవం ప్రపంచగతిని మార్చివేసిందని అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందడానికి స్ఫూర్తిగా నిలిచిందని ఆయన తెలిపారు. అక్టోబరు విప్లవ స్ఫూర్తే భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య నినాదానికి కారణమైందని ఆయన అన్నారు. అక్టోబరు విప్లవ 107వ వార్షికోత్సవ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం అక్టోబరు విప్లవ వార్షికోత్సవ సభ, లెనిన్ శత వర్ధంతి సభలను సంయుక్తంగా నిర్వహించారు. శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ రష్యాలో జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, అట్టడుగువర్గాలు సాధించిన మహత్తర విజయమే అక్టోబరు విప్లవమన్నారు. అక్టోబరు విప్లవం పాలితులను పాలకులుగా మార్చిందని ఈ విజయం రష్యాకే పరిమితం కాకుండా అనేక ప్రపంచ దేశాలలో స్వాతంత్ర్య ఉద్యమాలకు సామాజిక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిందన్నారు. కారల్‌మార్క్స్, ఎంగిల్స్ రచించిన మార్క్సిజం భావం మాత్రమే తప్ప ఆచరణ సాధ్యం కాదని ప్రచారం జరుగుతున్న రోజుల్లో మార్క్సిజాన్ని వాస్తవంలోకి తెచ్చిన మహనీయుడు లెనిన్ అన్నారు. భారతదేశం సైతం బ్రిటిష్ పాలనలో మగ్గుతున్న తరుణంలో అక్టోబరు విప్లవం భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి దన్నుగా నిలిచిందని ఆ తర్వాత సోవియట్ రష్యాతో 50ఏళ్ల పాటు భారతదేశం సంబంధాలను కొనసాగించిందని హేమంతరావు తెలిపారు. దేశంలోను ఎఐటియుసి ఆతర్వాత 1925లో కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావానికి కారణమైందన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలకు సోషలిజమే పరిష్కారమన్నారు. మతోన్మాదం పెచ్చరిల్లిన ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యుదయ భావజాలంతో ప్రజా సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సంబురాలను గ్రామ గ్రామాన నిర్వహించి పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు ముందు పార్టీ ప తాకాన్ని జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. సభలో సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు ఉపాధ్యాయులను వినియోగించొద్దు

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒకు వినతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను వినియోగించి ఒక్కపూట బడులు నిర్వహించడం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడానికేనని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. ఎఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటికాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించడం, అందుకు ప్రాథమిక పాఠశాలలకు ఈనెల ఐదు నుండి 30 వరకు ఒక్కపూట బడులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా 750కు పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధన సరిగ్గా అందకపోవడమే కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యపై పెను ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి కులగణనకు ఉపాధ్యాయులను ఉపయోగించకుండా ఇతర ఉద్యోగుల ద్వారా కుల గణన సర్వే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివనాయక్, వంశీ, రాకేష్, ప్రతాప్, సునీల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులేవీ?

'చలో సర్కారీ దవాఖాన' కార్యక్రమంలో ఎఐవైఎఫ్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఎఐవైఎఫ్ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో ఛలో సర్కారీ దవాఖాన కార్యక్రమం పేరిట గోదావరిఖని ప్రభుత్వం ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఈ సంధర్భంగా ఎఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించి, కొత్త సూపరిండెంట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో సానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచాలని, ఓపి అనంతరం రోగులకు ఫార్మసీలో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఒపి జూనియర్ డాక్టర్ల పర్యవేక్షణ జరుగుతుందని, సీనియర్ డాక్టర్లు సైతం ఒపిలో కూర్చునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఎంఆర్ఐ స్కానింగ్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలోని మహిళా వార్డులలో మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోవడం, నీటిసరఫరా లేకపోవడంతో దుర్వాసన వస్తుందని, దానిపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వాటర్ ఫిల్టర్లు పాడైపోయి రోగులకు వారితో వచ్చే అటెండర్లకు మంచినీటి కొరత ఏర్పడుతుందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిని సందర్శించిన వారిలో ఎఐవైఎఫ్ నగర అధ్యక్షకార్యదర్శులు సాదుల శివకుమార్, ఆసాల నవీన్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదు

పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమంలో పువ్వాడ

ప్రజాపక్షం/ఖమ్మం : కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని, కరుడుకట్టిన పెట్టుబడి దారి దేశాలు సైతం సంక్లిష్ట స్థితిలో మార్క్స్ ఆలోచనలను పరిగణలోకి తీసుకుంటున్నాయని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు శక్తులు పురోగమించడం పలు దేశాలలో ప్రజాస్వామ్య పద్ధతులలో సైతం అధికారంలోకి రావడం దీనికి సంకేతమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా గురువారం గిరిప్రసాద్ భవన్‌లో పార్టీ సభ్యత్వ, పునరుద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిజానికి మరణం లేదని సృష్టి ఉన్నంత కాలం దోపిడీ ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. మారిన రాజకీయ పరిస్థితులలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష కుటుంబాలు కమ్యూనిస్టు పార్టీ నీడ ఉండటం అభినందించదగిన విషయమని ఈ కుటుంబాల సంఖ్యను శత సంవత్సరాల వేళ మరింతగా పెంచాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు ఎజెండాగా పార్టీ ఉద్యమాలను, పోరాటాలను నిర్వహించాలన్నారు. పార్టీ నేతలు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులకు పార్టీ సభ్యత్వం ఇచ్చి పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్, చింతకాని, ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు, నాయకులు పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటమే లక్ష్యం

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేయడమే లక్ష్యంగా సిపిఐ పనిచేస్తుందని పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. గురువారం హయత్‌నగర్ మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం మండల సహాయ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ప్రస్థానం మొదలైందని, ఎన్నో పోరాటాలు, అవమానాలు,అసమాతాలను జేయించి ప్రజల తర్పున నిలబడ్డి ఎంతో మంది కమ్యూనిస్టు త్యాగాలు, బలిదానాలతో దేశంలో కోసం నిలబడిన కమ్యూనిస్టు మాత్రమే అని కొనియాడారు. దేశంలో బిజెపి మతోన్మాదం పేరుతో రాజకీయం చేస్తుందని, ఆ కట్రలను తిప్పకొట్టాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ వందవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, ఎఐటియుసి మండల కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి విష్ణువర్ధన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శోభన్, సుజాత, పారిజాత, యమునా, అనిత, సౌజన్య, వెంకట్, వీరస్వామి, అరుణ, జ్యోతి, నాగరాజు, వెంకట్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌గాక విద్యార్థుల ఇబ్బందులు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/సూర్యాపేట : ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు యాజమాన్యాలు ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాజీ ఎఐఎస్ఎఫ్ నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎఐఎస్ఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం పట్ల గత పాలకులు వ్యవహరించిన తీరునే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభించడం సరైంది కాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు యాజమాన్యాలు ధృవీకరణపత్రాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి తమ్మరబోయిన నరేష్, నాగరాజు, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహానగరి

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని ఎన్‌జిఒస్ కాలనీలో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పంపన వెంకటేశ్వర్లు, శరత్, జైపాల్‌రెడ్డి, సుధీర్, కామేష్, మధు, రమేష్, వేణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పల్లేకుండా వివరాల సేకరణ

ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కమిషనర్ బి.శరత్‌చంద్ర కోరారు. గురువారం పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. తప్పుల్లేకుండా సర్వేలో వివరాల సేకరణ చేయాలని ఎన్యుమరేటర్ల కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు ఎండి నహీం, చంద్రశేఖర్, రాజశేఖర్, మానస పాల్గొన్నారు.

50 వేల మ్యాన్‌హోల్స్ శుద్ధి

700 కిలో మీటర్ల పైపు లైన్ పూడిక పనులు

అధికారులు, సిబ్బందికి ఎండి అభినందన

ప్రజాపక్షం/హైదరాబాద్ : సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా జల మండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 50 వేల మ్యాన్ హోల్స్ శుభ్రం చేశారు. దీంతో పాటు 6140 ప్రాంతాల్లో 700 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్‌ను పూడిక పనులు నిర్వహించారు. ఈ ఘనత సాధించినందుకు అధికారులు, సిబ్బందిని ఎండి అశోక్ రెడ్డి అభినందించారు. అందరూ నిబద్ధతతో పని చేస్తున్నారని ప్రశంసించా రు. ముఖ్యంగా గత 15 రోజులుగా పనితీరు బాగుందని కొనియాడారు. ఇదే స్ఫూర్తి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్ సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా జలమండలి 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడంతో పాటు, భవిష్యత్తులో నీటి కరవు రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

గౌతమి గ్రామర్ హైస్కూల్‌పై చర్యలు

సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చందుయాదవ్ వినతి

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : విద్యార్థులను వేధిస్తున్న కొత్తగూడలోని గౌతమి గ్రామర్ హైస్కూల్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని సిపిఐ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చందు యాదవ్ శేర్లింగంపల్లి మండల్ విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తగూడలోని గౌతమి గ్రామర్ హైస్కూల్లో క్రీడలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల నుంచి వెళ్లిన ఓ విద్యార్థికి టిసి ఇవ్వకపోవడంతో పాటు అడగడానికి వెళ్లిన వారిపై పోలీసులతో కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని మండల విద్యాధికారిని కోరారు. కార్యక్రమంలో కూన కాసిం, చక్రవర్తి, నితీష్ యు శ్రీరామ్, అజమ్ పాల్గొన్నారు.

మినీ రవీంద్ర భారతిగా వనస్థలిపురం హుడా ఆడిటోరియం

సిఎం రేవంత్‌రెడ్డికి కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి వినతి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చడానికి వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసం లో కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో ఉన్న హుడా ఓపెన్ ఆడిటోరియంలో మినీ రవీంద్ర భారతి నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కార్పొరేటర్ విన్నవించారు. ఎన్నోళ్లుగా పెండింగ్‌లో ఉన్న మినీ రవీంద్ర భారతి నిర్మాణం పనులు పూర్తి చేసినట్లయితే ఈ ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగ పడుతుందని సిఎంకు తెలిపారు. డివిజన్‌లో ప్రధాన సమస్యలు భూగర్భ డ్రైనేజీ, ప్రతి కాలనీలకు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

అధికారులకు సహకరించాలి

కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

ప్రజాపక్షం/రాజేంద్రనగర్ : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే తీరు, ఇంటింటికి స్టిక్కరింగ్ తీరును గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే జరుగుతున్న తీరును ఎన్యుమరేటర్ల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేకు, స్టిక్కరింగ్‌కు ప్రజలంతా పూర్తిగా సహకరించి ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాపయ్య యాదవ్, బిల్ కలెక్టర్లు ఇమ్రాన్, కాలనీవాసులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలి

ప్రజాపక్షం/షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు కనీస పెన్షన్ రూ.10వేలకు పెంచాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్‌లో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కమిటి సభ్యులు శేఖర్ గౌడ్, ఆబ్బె సంతోష, కసాల యాదయ్య, జిల్లా నాయకులు మనిలా, మురళి, సరిత, గౌసియా, మాలన్‌బీ, రహీమ్, నర్సింలు, చిన్నగౌడ్, కృష్ణయ్య, శ్రీనివాస్, రామస్వామి, మురళీధర్‌రెడ్డి, సురేష్‌లు ఉన్నారు.

వెస్ట్‌బెంగాల్ టూ హైదరాబాద్

హెరాయిన్ డ్రగ్స్ స్మగ్లింగ్ దృష్టి సారించిన ఎక్సైజ్ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గోవా, ముంబాయి, బెంగుళూరు, తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు స్మగ్లింగ్ అవుతున్న డ్రగ్స్‌ను ఎక్సైజ్ అధికారులు కట్టడి చేయడంలో విజయం సాధించారు. తాజాగా డ్రగ్స్‌ముఠా తన పంథా మార్చుకుంది. వెస్ట్‌బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు హెరాయిన్ డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేస్తున్నారు. వెస్ట్‌బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చే వలస కూలీల ద్వారా వీరు హెరాయిన్‌ను సరఫరా చేస్తున్నారు. ఇలా వచ్చిన హెరాయిన్‌ను స్మగ్లర్లు హైదరాబాద్‌లో తీసుకుంటున్నారు. వీటిని సరఫరా చేసినందుకు ఒక్కొక్క కూలీకి రూ.5000 కమీషన్ రూపంలో ఇస్తున్నారు. పొద్దంతా కష్టపడితే వెయ్యి రూపాయలు కూడా సంపాదించలేని తమకు ఏ కష్టంలేకుండానే రూ.5000 వస్తుండడంతో వెస్ట్‌బెంగాల్ కూలీలు హెరాయిన్ స్మగ్లింగ్ దందా వైపు మొగ్గుచూపుతున్నారు. వెస్ట్ బెంగాల్ నుంచి బతకడానికి వచ్చారు. లెబర్ పనులు చేస్తారు. వచ్చె కొద్దిపాటి ఆదాయంతో లాభం లేదని భావించి డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. గురువారం తాజాగా హైదరాబాద్‌లో రూ. 3.50 లక్షల హెరాయిన్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకోవడంతో ఈ స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టయ్యిందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ కేసులో ముగ్గురు కూలీలను అరెస్టు చేసి వారి నుంచి హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శంషాబాద్, షేర్లింగంపల్లి అపోల హస్పత్రి వెనుక వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజ్ముల్ హెస్సేన్, నూర్ ఆజం ఖాన్, ఎస్‌కె సురోజ్‌లు నివాసముంటున్నారు. ఈముగ్గురు కూలీలు వెస్ట్‌బెంగాల్ నుంచి హెరాయిన్ అనే డ్రగ్స్‌ను తీసుకువచ్చి ఇక్కడి వ్యా పారుల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న డిటిఎఫ్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ శ్రీకాంత్, నెహ్రూ, గణేష్, శేఖర్లు తమ బృందంతో కలిసి వెస్ట్‌బెంగాల్ కూలీలు నివాసముంటున్న నివాసంపై దాడి చేశారు. ఆ ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 70 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుని శేరిలింగంపల్లి పోలీసులకు అప్పగించారు. డ్రగ్స్ పట్టుకున్న టిడిఎఫ్ సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ఎఇఎస్ శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.

కూలీలపై దృష్టి : కమలాసన్‌రెడ్డి

వెస్ట్‌బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు హెరాయిన్ స్మగ్లింగ్ వెలుగు చూడడంతో హైదరాబాద్‌లో నివాసముంటున్న వెస్ట్‌బెంగాల్ కూలీలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్‌రెడ్డి తెలిపారు. వెస్ట్‌బెంగాల్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులపై నిఘా పెట్టామని, సికింద్రాబాద్‌కు వచ్చే ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. కమీషన్లకు ఆశపడి డ్రగ్స్ సరఫరా చేస్తే కటకటాలపాలవుతారని ఆయన హెచ్చరించారు.

'ఔషధ ఉత్పత్తి' యూనిట్‌పై డ్రగ్స్ కంట్రోల్ దాడి



నేషనల్ ఫార్మక్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ(ఎన్‌పిపిఎ) నిర్ణయించిన ధరల కంటే అత్యధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధ ఉత్పత్తిదారులపైన డ్రగ్స్ కంట్రోల్ అడ్మిని స్ట్రేషన్ (డిసిఎ) అధికారులు దాడులు నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో గాజులరామారంలో మెడ్‌జిన్ లైఫ్ సైన్స్‌కు చెందిన యూనిట్‌లో యాంటిబయోటిక్ ఆయింట్‌మెంట్ మందును ఉత్పత్తి చేస్తున్నారు. ఈ మందును (ఎన్‌పిపిఎ) నిర్ధేశించిన ధరల ప్రకారం ఒక్క గ్రామ్‌కు రూ.20.29 చొప్పున ఐదు గ్రాముల ఆ యింట్‌మెంట్‌ను రూ.101.45లకు,జిఎస్‌టి మొత్తం కలిపి రూ.113.624 మించరాదు. కానీ ఇందుకు భిన్నంగా రూ.30. 37 అధికంగా విక్రయిస్తున్నారు. దీంతో డ్రగ్స్‌కంట్రోల్ అధికారులు ఉత్పత్తి చేస్తున్న యూనిట్ పైన దాడి చేసి కేసు నమోదు చేశారు. డ్రగ్స్ అసిస్టెంట్ డైరక్టర్ ఎం.విజయగోపాల్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు ఐ.శ్రీకాంత్, టి.శివతేజ, కె.మురళీకృష్ణ బృందం దాడి చేసింది. నేషనల్ ఫార్మక్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ వి.బి.కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు.

జిహెచ్‌ఎంసి పరిధిలో ముమ్మరంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఈనేపథ్యంలో జిహెచ్‌ఎంసిలో మొదటి దశలో ఎన్యుమరేటర్ బ్లాక్‌లో ప్రతిఇంటిలో గల కుటుంబాల వివరాలను నమో దు చేస్తూ వాటికి సంబంధించిన ఇంటి నెంబర్, కుటుంబ యజమాని పేరుతో కూడిన ఇళ్ల జాబితా 6వ తేదీ నుండి 8 వరకు ఇండ్ల జాబితాను తయారు చేయడంతో పాటు స్టిక్కర్ ఇంటి గోడలపై అతికిస్తున్నారు. ఇప్పటి వరకు 13,35,673 ఇళ్లను లిస్ట్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ వేశారు. శుక్రవారం స్టిక్కర్ వేసే ప్రక్రియ ముగియనున్నది. రెండో దశలో 9 తేదీ నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేలో కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఎన్యూమరేటర్లు సేకరించిన డేటాను కంప్యూటరైజ్డ్ చేసి గోప్యత పాటిస్తారు. ఈ నేపథ్యంలో సర్వేను ఎప్పటికిప్పుడు పర్యవేక్షణకు డిప్యూటీ, జోనల్ కమిషనర్లు పరిశీలిస్తారు.

సత్వరమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత రంగారెడ్డి జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు 39 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైనగన్ని బ్యాగులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరే విధంగా వాహనాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్‌ఒ సంగీత, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా మేనేజర్ గోపి కృష్ణ, వ్యవసాయశాఖ అధికారి నర్సింహ్మా రావు, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, డిసిసిఒ సుధాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలి

ఇంటింటి సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోకాపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్‌కు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నార్సింగి మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాతా, శిశు సంరక్షణే ధ్యేయం

రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్‌ఇ డాక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : మాతా శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం శివరాంపల్లి లోని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లకు మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణీలకు సూచించవలసిన జాగ్రత్తలు, తల్లి ఆరోగ్యానికి సంబంధించి పాటించవలసిన నియమాలను వివరించారు. గర్భిణీ ప్రసవించే తేదీ రిజిస్టర్లు సబ్‌సెంటర్ వారిగా నిర్దేశించిన రంగులచే పాటించాలని తెలిపారు. ప్రసవం తర్వాత శిశువులకు తల్లి ముర్రు పాలు తాగించే విధంగా సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించాలని, శిశువు ప్రసవం తర్వాత తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండే విధంగా సంరక్షించాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురైన గర్భిణీలకు టెలి మానస్ సహాయక కార్యక్రమం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ అభివృద్ధికి చర్యలు

కార్పొరేటర్ నర్సింహ్మారెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి కలిసి గురువారం మార్నింగ్ వాక్‌లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్సూరాబాద్ డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనులకు సహకారం అందిస్తామన్నారు. బిగ్ బజార్ రోడ్డు నుంచి సుష్మా వరకు రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్యా రోడ్డు విస్తరణ పనులను త్వరగా చేపట్టాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహ్మారెడ్డి జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. బిగ్ బజార్ నుండి సుష్మా వరకు రోడ్ ఎన్‌క్రోచ్ మెంట్ అయిన రోడ్డు ఇరువైపుల షాపులు, వ్యాపారాలకు సంబంధించిన డబ్బాలు, బోర్డులు, రాంపులను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు కోరారు. గత 15 సంవత్సరాల నుండి ఇప్పటివరకు అప్పటి శానిటేషన్ సిబ్బంది మాత్రమే ఉన్నారని, కాలనీలు రోజురోజుకు పెరుగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతున్నాయని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే శానిటేషన్ సిబ్బందిని పెంచేలా ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆర్థికంగా బలపర్చేందుకు కృషి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/నందిగామ : మత్స్యకారులను ఆర్థికంగా బలపరిచేందుకు ప్రభుత్వం అన్నివిధాల చర్యలు తీసుకుంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలోని అక్కమ్మ చెరువులో చేపపిల్లలను వదిలే కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వందశాతం సబ్సిడీతో చేప పిల్లలను చెరువులో వదలడంతో మత్స్యకారులు, ముదిరాజులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నర్సప్పగూడ గ్రామంలో ఉన్న 150మంది మత్స్యకారులకు వలలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధ్యక్షుడు కొడిచర్ల యాదయ్య, కార్యదర్శి నీరటి అశోక్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, కోడిచర్ల శ్రీనివాస్, అంచ రాములు, చందన్, నీరటి నరసింహా, బాలరాజ్, రాజు, శేఖర్, శివకుమార్, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు..

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరు దైవారాధనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం కొత్తూరు మండల పరిధిలోని వైఎం తండాలో నూతనంగా నిర్మించనున్న లింగ బసవేశ్వర స్వామి ఆలయం, హనుమాన్ దేవాలయ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అంతకుముందు షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, కొమ్ము కృష్ణ, జమ్మద్ ఖాన్, గంధం ఆనంద్, వీరేశం, శివయ్య, భీరప్ప తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఆత్మగౌరవ ప్రతీక 'సదర్'

ప్రజాపక్షం/మొయినాబాద్ : యాదవుల ఆత్మగౌరవ ప్రతీక సదర్ ఉత్సవాలు అని, సదరు ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం రాత్రి మొయినాబాద్ మండల కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ మొయినాబాద్‌శాఖ ఆధ్వర్యంలో సదరు సమ్మేళనం నిర్వహించారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్, సుందరేశ్వరస్వామి ఆలయ అర్చకులు సురేష్ జ్యోతి ప్రజ్వలన చేసి సదరు సమ్మేళనాన్ని ప్రారంభించారు. యాదవులు నిర్వహించిన సదరు సమ్మేళనం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీల నాయకులు చిన్న శ్రీశైలంయాదవ్, గుంటి శ్రీనివాస్ యాదవ్, అందెల శ్రీరాములు యాదవ్, అనంతరెడ్డి, లక్ష్మణ్ యాదవ్, రమేష్ యాదవ్, బర్ల జగదీష్ యాదవ్, యాదగిరి యాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, మండల అధ్యక్షుడు బైకని చెన్నయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి పోతుల రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహానగరి

కల్లుషాపుల కట్టడికి చర్యలు చేపట్టండి

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ సిటీలోను, దానికి ఐదు కిలోమీటర్ల దూరం వరకు కల్లు దుకాణాలు ఏర్పాటు చేయరాదన్న ప్రభుత్వ ఉత్తర్వుల అమలు కావడం లేదంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు గురువారం విచారించింది. ఇదే తరహాలో గతంలో దాఖలైన పిటిషన్‌తో కలిపి తదుపరి విచారణ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ బెంచ్ ప్రకటించింది. సరూర్‌నగర్‌కు చెందిన ఎస్.బాలరాజ్ వేసిన పిల్‌లో సిటీకి 50–60 కిలోమీటర్ల వరకు కల్లు చెట్లు లేవని, అయినా తాటి కల్లు అమ్మకాలు జరుగుతున్నాయని, కల్తీ కల్లు వల్ల పలువురి ఆరోగ్యం దెబ్బతింటోందని పేర్కొన్నారు.

చందాదారుల వివరాలు ఇవ్వండి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మార్గదర్శి ఫైనాన్సియర్స్ చందాదారు వివరాలను పెన్‌డ్రైవ్‌లోఉండవల్లి అరుణ్‌కుమార్‌కు ఇవ్వాలని ఆ సంస్థకు హైకోర్టు ఆదేశించింది. పెన్‌డ్రైవ్‌లో వివరాలు ఇస్తే జరిగిన అక్రమాలను వివరిస్తామని ఉండవల్లి చెప్పిన కారణంగా ఈఉత్తర్వులను జారీ చేసింది. పెన్‌డ్రైవ్‌లో అందుకునే వివరాలను ఇతరులకుఇవ్వరాదని ఉండవల్లిని ఆదేశించింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు,ఆర్‌బీఐలు కౌంటర్లు వేయాలనినోటీసులు ఇచ్చింది.మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్టవ్యతిరేకంగా చందారుల నుంచి డిపాజిట్లను సేకరిస్తోందం టూ ఉండవల్లి వేసిన కేసు విచారణను జనవరి 3కు వాయిదా వేస్తూ జస్టిస్ సుజోయ్‌పాల్,జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు బెంచ్ గురువారం ఆదేశాలిచ్చింది.

శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాపక్షం/హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయి గారి జన్మదినం సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థలు, మెడికవర్ హాస్పిటల్, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని శ్రీచైతన్య కళాశాలల్లో, స్కూళ్లలో 3700కి పైగా మంది విద్యార్థులు, శ్రీచైతన్య సిబ్బంది పాల్గొని 3700 యూనిట్లకు పైగా రక్తదానం సేవాస్ఫూర్తిని నింపారు. ఈ రక్తదాన కార్యక్రమంలో భాగంగా మియాపూర్ లో శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్ వేస్‌స్కూల్‌లో 300 మందికి పైగా సిబ్బంది రక్తదానం చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయి మాట్లాడుతూ ... 40 ఏళ్ల క్రితం డాక్టర్ బియస్ రావుగారు నాటిన ఓ చిన్న విద్యావిత్తనం నేడు మహావృక్షమై ఎందరో ప్రపంచం గర్వించే మేధావులను అందించే స్థాయికి చేరడం వెనుక డాక్టర్ బియస్ రావుగారి అకుంఠిత దీక్ష, శ్రీచైతన్య విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషి వెలకట్టలేనిదన్నా రు. శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరక్టర్ సీమ బొప్పన తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అర్ధనారీశ్వరం ప్రదర్శన

ప్రజాపక్షం /ఖైరతాబాద్ : ఏకం అర్ధనారీశ్వరం నృత్యం వీక్షకులను అలరించింది. హిర ణ్మయి నృత్యాలయ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో అలంపూర్, కాశీ, తుల్జాపూర్, మధురై అండ్ కోల్‌కతా శివశక్తి, క్షేత్ర పురాణాల ప్రదర్శనలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. హిరణ్మయి నృత్యాలయ వ్యవస్థాపకురాలు, నాట్యాచార్య ప్రియాంక బర్దే ఆరోసారి అర్ధనారీశ్వర ప్రదర్శనను చూసిన పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పంజాల, తెలంగాణ భాషా సాంస్కృతిక విభాగం డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కూచిపూడి యక్షగానం గురు డా.పసుమర్తి శేషబాబు,అమీ గనట్రా, విశేష్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన మజ్దూర్ యూనియన్ సభ్యులు

ప్రజాపక్షం/చర్లపల్లి : కార్మికుల పక్షాన ఉండే ఒకే ఒక్క యూనియన్ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అని ఘట్‌కేసర్ బ్రాంచ్ సెక్రెటరీ బొల్లెపల్లి శ్రీనివాస్, చైర్మన్ డి విజయ్‌కుమార్‌లు అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రెటరీ కామ్రేడ్ పి రవీందర్ ఆదేశాలతో ఘట్కేసర్ యూనియన్ సభ్యులు చర్లపల్లి, మౌలాలీ, లాలాగూడ, అమ్ముగూడ రైల్వే స్టేషన్‌లో ఎల్సిగేట్లు గ్యాంగ్ మూనిట్లు తిరిగి కార్మికుల సమస్యలను గురువారం అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 4,5,6, తేదీ ల్లో జరగబోయే యూనియన్ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ దిలీప్ కుమార్, ఏ.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టులు

ప్రజాపక్షం/చర్లపల్లి : జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు 2024లో భాగం గా కాప్రా మండల పరిధిలో గురువారం పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను కుషాయిగూడ,చర్లపల్లి, కాప్రా, బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఇం దులో 6 వేల మంది 8,9,10వ తరగతి విద్యార్థులు చెకుము కి టెస్టుల్లో పాల్గొంటున్నారని సభ్యులు తెలిపారు. టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికని ప్రభాకర్, జెన్నీలు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, జెవివి సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసంలో దుండగులు అరెస్ట్

ప్రజాపక్షం/దుండిగల్ : ప్రగతినగర్‌లోని లేక్ వ్యూ కాలనీలో గాంధీ విగ్రహాన్ని ఇటీవల ధ్వంసం చేసిన నలుగురు దుండగులను బాచుపల్లి, బాలానగర్ జోన్ ఎస్‌ఓటి పోలీ సులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి సమయంలో ప్రగతినగర్‌లోని లేక్ వ్యూ కాలనీలో గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారనే జెగ్గా మధు సుధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ఈ కేసులో నిందితులైన కొప్పడి నవీన్, వరలక్ష్మి నరసింహా, తన్నరు బ్రహ్మయ్య, కూరాల ప్రవీన్ నలుగురిని అరెస్ట్ చేశా రు. పోలీసులు వీరి నుండి రెండు ద్విచక్ర వాహనాలు , నా లుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిం దితు లు అందరూ బాచుపల్లి పరిధిలోని 191 కాలనీ, ప్రగతి నగర్‌కు చెందినవారని తెలిపారు. అనంతరం బాలానగర్ జోన్ డిసిపి బాచుపల్లి పోలీసు అధికారులు, ఎసిపి కూక ట్‌పల్లి, ఇన్‌స్పెక్టర్ బాచుపల్లి, పోలీసులను అభినందించారు.

లోటుపాట్లను సరిదిద్దడమే లక్ష్యం

ఓటింగ్ శాతం పెరిగేలా చేయాలి

ఎన్నికల పరిశీలకులు రహమత్ అలీ

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ఇటీవలి ఎన్నికల్లో చోటు చేసుకొన్న లోటుపాట్లు మరో సారి జరిగే ఎన్నికల్లో తలెత్తకుండా తీసుకోవాల్సిన అప్రమత్తతల కోసం జాతీయ ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను రూపొందిస్తుందని మేడ్చల్ జిల్లాకు నియమమితులైన ఎన్ని కల పరిశీలకులు రహమత్ అలీ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ గౌతంతో కలిసి నిర్వహించిన జిల్లా ఎన్నికల ప్రణాళిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యతనిచ్చే దిశగా ఈ ఎన్ని కలు నిర్వహించేందుకు జాతీయ ఎన్నికల కమిషన్ గత అనుభవాలను బేరీజు వేసుకొంటూ చిన్న చిన్న అంశాలను సైతం పరిగణలోకి తీసుకొంటూ అవసరమైన సవరణలు చేస్తుం టుందని, దీనిలోని భాగంగా మేడ్చల్ జిల్లాకు పరిశీలకుడిగా దశల వారీగా స్పెషల్ సమ్మరీ రివిజన్ రూపొందిస్తామన్నారు. మేడ్చల్ జిల్లాలో 2435 పోలింగ్ బూతులు ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో తక్కువగా నమోదైన ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనికి జిల్లా యంత్రాంగంతో పాటు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఓటరు జాబితాలో తన పేరు నమోదయ్యేలా జిల్లా యంత్రాంగం చైతన్య పరచాలన్నారు. జిల్లా కలెక్టర్ గౌతం మాట్లాడుతూ జిల్లాలో 60 శాతం జిహెచ్‌ఎంసి పరిధిలో ఉన్నందును జనభా ఎక్కువగా ఉందన్నారు. గ్రామీణ స్థాయిలో ఓటరు శాతం తగ్గుతుందన్నారు. క్రమం తప్పకుండా ఓటరు నమోదుకు సంబంధించిన సమావేశాలను నిర్వహించాలని స్వీప్ అధికారికి కలెక్టర్ సూచించారు. మల్కా జిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకొనే సమయంలో సాఫ్ట్‌వేర్ సమస్యలు తరచు చోటు చేసుకొంటున్న విషయాన్ని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ సకాలంలో జరిగినందున ఓటరు జాబితాలో ఒక కుటుంబంలోని సభ్యులకు వేర్వేరు బూతుల్లో కేటాయించడం జరుగుతోందని, దీని వల్ల వారికి ఓటు వేయాలన్న ఆసక్తి సన్నగిల్లి ఓటు వేయటం లేదన్నారు. బిఎల్‌ఓలకు ఇచ్చే గౌరవ వేతనం తక్కువగా ఉందని, దీన్ని పెంచాల్సిన అవరసం ఉందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, ఆర్‌డిఓ సైదులు, స్వీప్ అధికారి సాంబశివరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కుల గణనతో సమగ్రాభివృద్ధి

ప్రజాపక్షం/అల్వాల్: సమగ్ర కుటుంబ సర్వే తోనే రాష్ట్రంలో అట్ట డుగు స్థాయిలో ఉన్న కులాలు ఇతర పేదలు ఆర్థిక అభివృద్ధి చెంది రాజకీయంగా సామా జికంగా రాణిస్తారని మ ల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్ డివిజన్ ఆదర్శనగర్‌లో బిసి కులగనలో కార్పొరేటర్‌లు చిం తల శాంతి శ్రీనివా స్‌రెడ్డి సబిత అనిల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారం భించారు. సూ పరిండెంట్ స్వామి, పిఓ మదన్మోహన్, స్థానికులు కృష్ణారె డ్డి, చరణ్‌గిరి, సురేందర్ రెడ్డి, సునీత, పెంటారెడ్డి, పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ లెక్కింపు

ప్రజాపక్షం/అల్వాల్ : బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సెంచర్ ఇఒ వీరేశం దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు నిర్వహిం చారు. హుండీ లెక్కింపులో భాగంగా 3 లక్షల 64 వేల 619 రూపాయలు ఆలయానికి ఆదాయం లభించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు వెంకట్రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, రామచందర్‌రావు, శివరామకృష్ణ, ఆల య సిబ్బంది వెంకట్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–III పరీక్షలకు మేడ్చల్ జిల్లాలో 115 పరీక్షా కేంద్రాలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–IIIపరీక్షలు మేడ్చల్ జిల్లాలో 115 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. 17న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్1, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్2, 18న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు గాను జిల్లా పరీక్షా కేంద్రాల్లో 65,361 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుండి , మధ్యాహ్నం 1.30 గంటల నుండిలోపలికి అనుమతిస్తారన్నారు. ఉదయం9.30 గంటల తర్వాత,మధ్యాహ్నం 2.30గంటలతర్వాత అభ్యర్థులు లోపలికి అనుమతి ఉండదన్నారు. తమ హాల్‌టికెట్లను http://www.tspsc.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, రెండు రోజుల్లో జరిగే పరీక్షలకు ఒకే హాల్ టికెట్ తీసుకొని రావల్సి వస్తున్నందున వాటిని జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటి కోసం హెల్ప్‌డెస్క్ 0402 3542185, 04023542187 ద్వారా కానీ helpdesk @tspsc.govin మెయిల్ ద్వారా కానీ సంప్రదించవచ్చన్నారు.

రాజీవ్ గృహకల్పలో పార్కుల అభివృద్ధి

గాజులరామారం సర్కిల్ డిసికి సిపిఐ వినతి

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్పలోని పార్కులను అభివృద్ధి చేయాలని సిపిఐ కుత్బు ల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. గురువారం సిపిఐ నాయకులు గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ప్రజావాణిలో పార్కులను అభివృద్ధి పరచాలని వినతి పత్రం అందజేసిన అందజేసిన ఇప్పటికి సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలోని పా ర్కులు నిరు పయోగంగా ఉన్నాయన్నారు. అందులో మట్టి, వ్యర్థాలతో పాటు గంజాయి, మందుబాబులకు అడ్డగా మా రిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా డబ్బాలు వేసుకుని వ్యాపా రం మాటున వెనుక ఉన్న స్థలాన్ని ఆక్రమించడానికి చూస్తు న్నారన్నారు. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ హస్తం ఉందని కూడా పత్రికలో వచ్చాయని, అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జగద్గిరిగుట్ట రోడ్డు నంబర్ 1లో సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, నూతన రోడ్డు వేయాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పార్కులను అభివృద్ధి పరిచేలా చూడా లన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు శ్రీని వాస్, సహదేవ్‌రెడ్డి, ఇమామ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో రెండో రోజూ సమగ్ర కుటుంబ సర్వే

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్

ప్రజాపక్షం/కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే రెండో రోజు ముమ్మరంగా సాగింది. సర్వే ఎన్యూమరేటర్‌లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను అడిగి స్టిక్కర్‌లను అందించడం జరుగుతుందని మున్సిపల్ కమిషినర్ బలరాం నా యక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ నెల 9వ తేది నుంచి నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని అదేశాలు ఉన్నాయన్నారు. అందుకు లక్ష్యంగా పెట్టుకుంటు ముందుగా ఇంటి నెంబర్ అందులో నివసిస్తున్న యజమాని పేరు నమోదు చేయనున్నామన్నారు. అప్పటికి మొత్తం ఇళ్లు వాటిలో నివసిస్తున్న కుటుంబాల సంఖ్య జాబితాను సిద్ధం చేయన్నుట్లు పేర్కొన్నారు. ప్రతి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమాచారం ఆధారంగా ప్రతి ఇంటికి వెళ్లి సభ్యులందరి పూర్తి వివరాలను సేకరించి నమోదు చేస్తున్నామన్నారు. కొడంగల్‌లో మొత్తం 34 మంది ఎన్యూమరేటర్‌లు, ముగ్గురు సూఫర్ వైజర్‌లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సర్వే కొసం వచ్చిన అధికారులకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. వీరితో పాటు మున్సిపల్ సీనియర్ అసిస్టేంట్ ఆంజనేయులు, ఎన్యూమరేటర్‌లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాపక్షం/తాండూరు : తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నూతన భవన నిర్మాణం పనులను తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గురువారం పనులను పరిశీలించిన ఎంఎల్‌ఎ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎంఎల్‌ఎ నిర్మాణం పనుల నమూనను పరిశీలించారు. ఎంఎల్‌ఎ వెంట మార్కెట్ కమిటి సభ్యులు, మాజీ జడ్పీటిసి ధారాసింగ్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు : మానవీణ కోణంలో మండలంలోని పలు గ్రామాలలో ప్రజా ఆరోగ్యం కోసం లొంక నర్సింహులు మెగా వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయ మని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు,ఎల్‌ఎన్‌ఆర్ యువసేనా ఆధ్వర్యాన గురువారం మండల పరిధిలోని బుద్దారం గ్రా మంలో మహావీర్ ఆసుపత్రి సహకారం నిర్వహించిన మేగా ఉచిత వైద్య శిభిరాన్ని ఎంఎల్‌ఎ హజరైన ప్రారంభించారు.ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల అందకు సహకరించిన మహావీర్ ఆసుపత్రి వైద్యులను, సిబ్బంది, లొంక నర్సిములను ఎంఎల్‌ఎ అభినందించారు. ఉచిత వైద్ శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎన్‌ఆర్ యువ సేనా నాయకులు లొంక నర్సిములు, మాజీ జడ్పీటిసి ధారాసింగ్‌నాయక్, ఉత్తమ్‌చంద్, ఉప్పరి మల్లేశం, వెంకటయ్య, మల్లుప్ప, డివై నర్సిములు, రాములు యాదవ్, బొర్ర నర్సిములు, అంజిలర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు అందరూ సహకరించాలి

ప్రజాపక్షం/తాండూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరు సహకరించాలని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం తాండూరు పట్టణ పరిధి 27వ వార్డులో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే అనేది దేశంలోనే ప్రథమమని అన్నారు. ఈ సర్వేలో తీసుకున్న వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి సరైన నిర్ణయాలు తీసుకోవాడనికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎవ్వరైన వలస వెళ్ళిన పక్కవారు వారికి సమాచారం అందించాలని కోరారు.ఈ సర్వే రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి విద్య వైద్య సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉపాది అవకాశాలు మెరుగుపడే విధంగా ఉంటుందనారు. కావున నియోజకవర్గం పరిధిలోని వివిద ప్రజా సంఘాల కుల సంఘాలు, మేధావులు, విధ్యావంతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అందరు సహకరించాలని కోరారు. అలాగే సర్వేలో పాల్గోనే అధికారులు చరిత్రలో మిగిలి పోతారని అన్నారు.ఇదో గొప్ప సామాజిక సంక్షేమ కార్యక్రమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహార్డెడి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ పట్టణ పార్టీ అధ్యక్షులు అబిబ్ లాల, ధారాసింగ్, పట్లోల నర్సిములు సిబ్బంది పాల్గోనారు.

రాణే ఇంజన్ వాల్స్ పరిశ్రమలో గెలుపుపై హర్షం

ప్రజాపక్షం/మొయినాబాద్: మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ లోని రాణే ఇంజన్ వాల్స్ పరిశ్రమలో బుధవారం కార్మిక శాఖ ఆధ్వర్య ంలో జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బిఎంఎస్ వరుసగా టిఆర్‌ఎస్ కార్మిక సంఘం పై మూడోసారి 141 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిందని ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనియన్ ప్రధాన కార్యదర్శి తూర్పు రామ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బిఎంఎస్‌కు మరోసారి పట్టం కట్టారని పరిశ్రమలో 1996లో బిఎమ్‌ఎస్ యూనియన్ స్థాపించిన నుండి కార్మికులకు సేవలందిస్తున్న బిఎంఎస్ పై రాణే కార్మికులకు చెక్కుచెదరని విశ్వాసం ఉన్నందుకు గర్వపడుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిఎంఎస్ సంఘటిత అసంఘటిత రంగాలలో కార్మికులకు ఎనలేని సేవలు అందిస్తున్నామని కార్మిక హ క్కుల పరిరక్షణలో బిఎమ్‌ఎస్ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బిఎంఎస్ ను ఆదరిస్తున్న రాష్ట్ర కార్మికులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక హక్కుల పరిరక్షణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని పోరాటాలు చేశామని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించి కార్మిక రంగము అభ్యున్నతికి పాటుపడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పుష్కరకాలంగా కార్మిక సమస్యలు పరిష్కారానికి నోసుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు సవరించకుండా కాలయాపన చేస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా కోటీ 50 లక్షల కార్మికుల పొట్ట కొడుతూ యాజమాన్యాలకు మేలు చేకూర్తున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తారని అన్నారు రాష్ట్రప్రభుత్వము వెంటనే కనీస వేతనాలు జీవోలను సవరించి కనీస వేతనం 25 వేల రూపాయలు పెం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే కార్యాచరణ రూపొందించి ప్రభుత్వాలపై పోరాటం ఉధృ తం చేస్తామని తెలిపారు.ఈ విజయోత్సవ సమావేశంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ఎన్ వెంకటేశ్వరరావు, పవన్ కుమార్, శ్రీరాములు, బాలరాజు,బిఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిశీలన

కార్పొరేటర్, డిఎంహెచ్‌ఒ

ప్రజాపక్షం/అల్వాల్ : అల్వాల్ పట్టణ కేంద్రంలోని నూతనంగా నిర్మించబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని డిఎంహెచ్‌ఒ డాక్టర్ రఘునాథ్ స్వామి, డిప్యూటీ డిఎం హెచ్‌ఒ డాక్టర్ శోభారాణితో కలిసి స్థానిక కార్పొరేటర్ చిం తల శాంతి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. మాట్లాడుతూ 18న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు సేవలు అందించడానికి ప్రారంభించబోతున్నామని కార్పొ రేటర్ వెల్లడించారు. అదేవిధంగా ఆస్పత్రికి సంబంధించిన పనులను పూర్తి చేసి సహకరించాలని కాంట్రాక్టర్లను కోరారు. భవనం పరిసర ప్రాంతాలను కూడా పరిశీలించి సంబంధిత పనులను పూర్తి చేసి పేద ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

www.prajapaksham.in ప్రజాపక్షం ప్రతి అక్షరం ప్రజల కోసం

దినపత్రికకు 6వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

దేశ సేవలో అలుపెరుగని సంస్థ...

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

(ప్రభుత్వ సంస్థ)

since 1889

బొగ్గు ఉత్పత్తితో పాటు 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదన, 245 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదన

కార్మిక సంక్షేమంతో పాటు సమీప గ్రామాల అభివృద్ధికి చేయూత

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com